మానేరు జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక


04.03.2025
మంగళవారం tuesday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 321
పేజీలు : 8
Pages : 8
Published from : Karimnagar

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

## రహానేకు కోల్‌కతా పగ్గాలు

వైస్ కెప్టెన్‌గా అయ్యర్





# గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన

## గిర్ వణ్యప్రాణి సంరక్షణలో లయన్ సఫారీ

**గాంధీనగర్, జనతా న్యూస్:** ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అందులోభాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షిం చడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాబో యేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

## త్వరలో రోడ్లపైకి హైడ్రోజన్ ఇంధన వాహనాలు!

- 5 ప్రయోగాత్మక ప్రాజెక్టులకు ఆమోదం
- దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు బాధ్యతలు

03




# కృష్ణాజలాల్లో తెలంగాణకు తీరని అన్యాయం

## కేటాయింపులకు మించి వాడుకుంటున్న ఏపీ

- కృష్ణా బేసిన్ నుంచి నీటి తరలింపును అడ్డుకోవాలి
- బనకచర్లకు గోదావరి తరలింపుపై కేంద్రానికి ఫిర్యాదు
- గోదావరి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలి
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో సింఎం రేవంత్ భేటీ
- పలు అంశాలపై వినతిపత్రం సమర్పణ

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక నీటిని తీసుకుంటోందని ఆయన విమర్శించారు. నీటి తరలింపును అడ్డుకోవాలని తాము కేంద్రాన్ని కోరామని స్పష్టం చేశారు. నికర జలాలలను సైతం వాడుకోవడం దుర్మార్గమని అన్నారు. గోదావరి వరద జలాలను బనకచర్లకు తరలిస్తామని అంటున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అయిన సీఎం.. పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

**న్యూఢిల్లీ, జనతా న్యూస్:**

న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పలువురు తెలంగాణ ఎంపీలతోపాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల కేటాయింపు, వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ఇటీవల జరిగిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సంఘటనను సైతం మంత్రికి వీరు సోదాహరణగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతోన్న బనకచర్లపై తమ అభ్యం తరాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలియజే శామన్నారు. అయితే ఏపీ నుంచి ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌పై తమకు ఎలాంటి డీపీఆర్ రాలేదని మం త్రి వివరించారని చెప్పారని తెలిపారు. అలాగే పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క - సారక్క ప్రాజెక్టు లకు.. త్వరగా నీటి కేటాయింపులు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన

మిగతా 2 లో



## ఇక్కడ థర్మల్.. అక్కడ సౌర విద్యుత్ ప్లాంట్లు

ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి



02

## సారంగం తప్పడం చేతకాక బీఆర్ఎస్‌పై నిందలు

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



# ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా కొమరయ్య, శ్రీపాల్ రెడ్డి

- కరీంనగర్‌లో మొదటి ప్రాధాన్య ఓట్లతో బీజేపీ అభ్యర్థి విజయం
- నల్గొండ స్థానంలో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిని వరించిన గెలుపు

**హైదరాబాద్, జనతా న్యూస్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్, మరో చోట బీజేపీ మద్దతుతో బరిలో దిగిన అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించగా ఉమ్మడి కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గం లో బీజేపీ మద్దతు పలికిన అభ్యర్థి మల్క కొమర య్య గెలుపొందారు. ఈ రెండో చోట్లా సిటింగ్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు.

మిగతా 2 లో


శ్రీపాల్‌రెడ్డి


కొమరయ్య

# తెలంగాణలో సిఎం మార్పు తథ్యం

## కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మార్పే దీనికి నిదర్శనం
## బిజెఎల్‌పి నేత ఏలేటి సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మారారంటే.. ఇక మారేది ముఖ్యమంత్రేనని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ టీమ్ నుంచి కొత్త ఇంఛార్జిని పెట్టారన్నారు. సోమవారం ఆయన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. 'సీఎం ఛేంజ్ అనే మిషన్‌ను మీనాక్షి నటరాజన్‌కు అప్పగించారు. సీఎంను మార్చేందుకు ఆమె గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్‌లో ముఖ్యమంత్రి మార్పు ఖాయం అని వ్యాఖ్యానించారు.





03

## నేటి నుంచి మీనాక్షి సమీక్షలు



03

## ఆస్తి కోసం తల్లిని హత్య చేసిన తనయుడు



## కృష్ణా ఆయకట్టుకు.. గోదావరి జలాలు

- రాజీవ్ లింక్ కాలువ ద్వారా వైరా జలాశయంలోకి తరలింపు
- మూడు పంప్‌హౌస్‌లలో కొనసాగుతున్న నీటి ఎత్తిపోతలు

**కొత్తగూడెం, జనతా న్యూస్:** నాగార్జున సాగర్ చివరి ఆయకట్టు లో నీరందక ఎండిపోతున్న పొలాలకు గోదావరి జలాలు ఊపిరి పోయనున్నాయి. సీతారామ ఎత్తిపోతల ద్వారా వైరా జలాశయం వైపు గోదావరి జలాలు పరుగులు పెడుతున్నాయి. ఖమ్మం జిల్లాలోని సాగర్ ఎడమ కాలువ ద్వారా తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు సీతారామ ప్రాజెక్టులోని మూడు పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. గత నెల 27న భద్రాద్రి జిల్లాలోని బీజీ కొత్తూర్ వద్ద

మిగతా 2 లో

# 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

## ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు వెసులుబాటు




02

- పరీక్ష కేంద్రం లొకేషన్ గుర్తించేలా హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్
- ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య
- రేపటి నుంచి పరీక్షలు..



# గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా మోదీ ఆదివారం రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం వంతారాను, సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సాసన్‌లోని రాష్ట్ర అటవీశాఖ అతిథిగృహమైన సిన్హ్ సదన్‌లో బస చేశారు. సోమవారం తెల్లవారుజామున గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయమైన ససన్ గిర్‌లో నిర్వహించనున్న నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ (ఔఃచిఒ) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఇందులో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పలు ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని ససన్‌లోని అటవీ సిబ్బందితో సంభాషించనున్నట్లు సమాచారం. ఆసియాటిక్ సింహాలను సంరక్షించే లక్ష్యంతో ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,900 కోట్లకు పైగా నిధులు మంజూరుచేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం.. ఆసియాటిక్ సింహాలు గుజరాత్‌లోని గిర్ అడవుల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

# కృష్ణాజలాల్లో తెలంగాణకు తీరని అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఇక తమ ప్రాజెక్టులకు సెంట్రల్ వాటర్ కమిషన్ క్లియరెన్స్ ఇంకా రాలేదని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరామని చెప్పారు. గోదావరి జలాలను అనుసంధానం చేసే అంశాన్ని కేంద్ర మంత్రికి వివరించామన్నారు. సమ్మక్క సారక్క, సీతారామ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు ఇంత వరకు జరగలేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో తమ ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం చెబుతోందంటూ ఏపీపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తమ ప్రాజెక్టులకు, శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే నికర జలాలు ఉన్నాయనేది లెక్క తేలుతుందని ఆయన వివరించారు. తెలంగాణలో గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాత ఇతర ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు. కృష్ణా బేసిన్‌లో ఏపీ సర్కార్ ఎక్కువ నీటిని తీసుకుంటోందని, అలా తీసుకోకుండా అడ్డుకోవాలని కేంద్రానికి చెప్పామన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్లపై తమ అభ్యంతరం తెలపగా.. తప్పకుండా జోక్యం చేసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారన్నారు. 'తెలంగాణలో గోదావరిపై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే జరగలేదు. మాకు కేటాయింపులు జరిగిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి. కృష్ణా జలాల విషయంలో వచ్చిన సమస్యలే భవిష్యత్‌లో గోదావరి విషయంలో వస్తాయి. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలి. అప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీఎం తెలిపారు. 'బనకచర్లపై ఏపీ సర్కార్ ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని కేంద్రమంత్రి చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు కేటాయింపుల పెంపుపైనా చర్చించాం. పాలమూరు



రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులకు కేంద్రాన్ని నిధులు అడిగాం. మొత్తం ఐదు ప్రాజెక్టులకు నిధులు కోరాం. ఉమ్మడి ప్రాజెక్టులపై టెలిమెట్రీలను త్వరగా ఏర్పాటు చేయాలని అడిగాం. టెలిమెట్రీల ఏర్పాటుకు అవసరమైతే ఏపీ వాటా భరిస్తామని చెప్పాం. మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ రిపోర్టు త్వరగా ఇవ్వాలని కోరాం. అలాగైతే మేం చర్యలు చేపడతామని చెప్పాం' అని ఉత్తమ్ మీడియాకు వివరించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ తీసుకు వెళ్తున్న అధిక జలాలను ఆపాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను తాము కోరామన్నారు. కేంద్రం అత్యవసరంగా జోక్యం చేసుకొని ఈ అన్యాయాన్ని ఆపాలని ఆయనకు విజ్ఞప్తి చేశామన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు తాము అభ్యంతరం చేప్పామని ఆయన స్పష్టం చేశారు. అయితే దీనిపై ఏపీ నుంచి ఎటువంటి నివేదిక రాలేదని.. ఈ అంశంలో తెలంగాణ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్ ద్వారా తెలంగాణకు అధిక నీరు ఇచ్చేలా సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. పాలమూరు రంగారెడ్డి, సమ్మక్క సారక్క, సీతారామ సాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు నిధులు సైతం ఇవ్వాలని తాము అడిగాని వివరించారు. అలాగే కృష్ణా నదిలో శ్రీశైలం, నాగార్జున సాగర్ సహా ఇతర ప్రాజెక్టులలో టెలీ మెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. అవసరమైతే.. టెలీమెట్రీల కోసం తెలంగాణ, ఆంధ్రా వాటా ఖర్చు సైతం తామే భరిస్తామని కేంద్రానికి స్పష్టం చేశామని వివరించారు. తమ ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ సానుకూలంగా స్పందించారన్నారు. మరోవైపు ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుంచి తెలంగాణకు 50 ఏళ్ల పాటు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరామన్నారు. అలాగే మేడిగడ్డ, సుందిళ్ల ప్రాజెక్టులపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నుంచి త్వరగా నివేదిక అందేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే తెలంగాణ జల వనరుల విషయంలో కేంద్రం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, తాను.. బలమైన వాదనలు వినిపించామని తెలిపారు. కృష్ణా జలాల వివాదంలో రోజువారీగా కేంద్రం జోక్యం చేసుకుంటుందని హామీ ఇచ్చిందని చెప్పారు. అదే విధంగా దీర్ఘకాలికంగా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని కోరాన్నారు. తుమ్మడిహట్టి సమీపంలో గతంలో కాంగ్రెస్ ప్రతిపాదించి పనులు మొదలు పెట్టనున్నామ న్నారు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో కూడా కేంద్రంతో చర్చించామన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి భూసేకరణ విషయంలో సహకరించాలని కేంద్రాన్ని కోరినట్లు వివరించారు.

# ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

- ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు వెసులుబాటు
- పరీక్ష కేంద్రం లొకేషన్ గుర్తించేలా హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్
- చేతిగడియారాలనూ అనుమతించం
- ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య
- రేపటి నుంచి పరీక్షలు.. హాజరుకానున్న 9.96 లక్షల మంది

**హైదరాబాద్:** 'ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఈసారి ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన వర్తించదు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాలు.. అంటే ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను అనుమతిస్తాం.. కాకపోతే ముందుగా వస్తే ఆందోళన లేకుండా రాసుకోవచ్చు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు ముందుగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలి' అని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సూచించారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఈనెల 5న ప్రారంభం కానున్న నేపథ్యంలో బోర్డు కార్యాలయంలో సోమవారం పరీక్షల విభాగం కంట్రోలర్ జయప్రద బాయి, సంయుక్త కార్యదర్శులు భీమ్‌సింగ్, మోహన్, జ్యోత్స్న తదితరులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఓఎంఆర్ పత్రాన్ని విద్యార్థులు పూర్తి చేయాలని, ఎవరికి వారు తమకిచ్చిన పత్రంపై తమ వివరాలే ఉన్నాయా? లేవా? అని సరిచూసుకోవాలన్నారు. ఈసారి హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించాం. దాన్ని స్కాన్ చేసి పరీక్షా కేంద్రం లొకేషన్ తెలుసుకోవచ్చు. ఒక రోజు ముందుగా కేంద్రాన్ని పరిశీలించడం అన్ని విధాలా మంచిది. ప్రశ్నపత్రంపై సీరియల్ నంబరు ముద్రిస్తున్నాం. ఏ సంఖ్య పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో దాని వల్ల తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదని తెలుసుకుంటారు. ప్రశ్నపత్రంలో ఏమైనా పొరపాట్లు ఉంటే పరీక్ష ప్రారంభమైన తర్వాత సవరించుకోవాలని(ఎరాటా) సమాచారం ఇస్తాం. ఇన్విజిలేటర్లు ఆ విషయాన్ని చెబుతారు. ఆ ప్రకారం విద్యార్థులు సరిచేసుకొని సమాధానాలు రాయాలి. గత ఏడాది వరకు సాధారణ(అనలాగ్) చేతిగడియారాలను అనుమతించేవాళ్లం. కాకపోతే ఏది అనలాగ్, ఏది స్మార్ట్ వాచ్ అనేది వందల మంది విద్యార్థులు వచ్చినప్పుడు గుర్తించే పరిస్థితి ఉండకపోవచ్చు. అందుకే ఈసారి ఏ రకమైన చేతిగడియారాలనూ అనుమతించడం లేదు. బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ని ఏర్పాటు చేశాం. పరీక్షా కేంద్రంలోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించాం. ఒక్కో జిల్లాకు ఒక్కో స్క్రీన్‌ను ఏర్పాటు చేశాం. మొత్తం 75 మంది సిబ్బంది పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తుంటారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా కొమరయ్య, శ్రీపాల్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు ఉమ్మడి కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 10 గంటల తర్వాతే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఇంకా చెల్లిన, చెల్లని ఓట్లను వేరుచేస్తున్నారు. ఈ ప్రక్రియకు మరింత సమయం పట్టనుండడంతో కౌంటింగ్ ఆలస్యం కానుంది. ఈ గ్రాడ్యుయేట్ స్థానంలో భారీగా ఓట్లు చెల్లుబాటు కాకపోవడం గమనార్హం. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ జరగగా.. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో, నల్గొండ జిల్లాలోని ఆర్జాల బావిలో కౌంటింగ్ జరిగింది. బీజేపీ బలపరిచిన అభ్యర్థులు మూడు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయగా, కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మాత్రమే పోటీ చేసింది.

## 5,777 ఓట్ల ఆధిక్యంతో..

ఉమ్మడి కరీంనగర్–మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీగా భాజపా బలపరిచిన అభ్యర్థి మల్క కొమరయ్య పీఆర్టీయూ(టీఎస్) అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 15 మంది అభ్యర్థులు ఈ స్థానంలో పోటీపడగా తొలి ప్రాధాన్య ఓట్లతోనే కొమరయ్య విజయాన్ని అందుకున్నారు. సిటింగ్ ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన కూర రఘోత్తంరెడ్డి కేవలం 428 ఓట్లు మాత్రమే సాధించారు. మొత్తంగా ఈ స్థానంలో 25,041 ఓట్లు పోలవగా 24,144 చెల్లుబాటయ్యాయి. 897 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. పోలైన ఓట్లలో 50 శాతానికి మించి(12,074) ఓట్లు విజేతకు రావాల్సి ఉండగా కొమరయ్యకు 12,959 ఓట్లు వచ్చాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి గెలుపొందిన అభ్యర్థికి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. కొమరయ్య 12,959, వంగ మహేందర్‌రెడ్డి 7,182, వై.అశోక్‌కుమార్ 2,621, కూర రఘోత్తమ్‌రెడ్డి 428, తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి 32 0, యాటకారి సాయన్న 293, మామిడి సుధాకర్‌రెడ్డి 153, ఎల్.సుహాసిని 78, గవ్వల లక్ష్మి 41, ముత్తారం నర్సింహస్వామి 31, కంటె సాయన్న 12, జగ్గు మల్లారెడ్డి 10, సిలివేరి శ్రీకాంత్ 7, చాలిక చంద్రశేఖర్ 6, వేముల విక్రమ్‌రెడ్డి 3 ఓట్లు సాధించారు.






## ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టి..

ఉమ్మడి వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిక హోరాహోరీగా సాగింది. పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపొందారు. యూటీఎఫ్‌నకు చెందిన సిటింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి రెండో స్థానంలో నిలిచారు. గెలుపు కోసం 11,281(50శాతం) ఓట్లు సాధించాల్సి ఉండగా మొదటి ప్రాధాన్య ఓట్లలో అత్యధికంగా పింగిళి శ్రీపాల్‌రెడ్డికి(పీఆర్‌టీయూటీఎస్) 6,035 ఓట్లు వచ్చాయి. గెలుపునకు అవసరమైన వాటికంటే 5,246 తక్కువగా వచ్చాయి. దీంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు మొదలుపెట్టి దిగువ నుంచి ఎలిమినేషన్ ప్రక్రియ చేపట్టారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు లభించడంతో ఆయనను విజేతగా ప్రకటించారు. మొత్తం ఓట్లలో చెల్లనివి 494 ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. మొత్తం 25,797 ఓట్లకు 24,135 ఓట్లు పోలయ్యాయని, వాటికి సంబంధించిన ఫలితాలనే వెల్లడిస్తామని ఆర్వో, నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించడం చర్చనీయాంశమైంది. పోలింగ్ జరిగిన తర్వాత అధికారికంగా మొత్తం 24,139 ఓట్లు పోలయ్యాయని వెల్లడించడమే కాకుండా సోమవారం లెక్కింపు సమయంలోనూ ఈ సంఖ్యనే ప్రకటించారు. మధ్యాహ్నం మొదటి రౌండ్ ఫలితాలు ప్రకటించే సమయానికి నాలుగు ఓట్లను తగ్గించడంపై ఆమె స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయమై విలేకరులు ప్రశ్నించగా.. సమాధానాన్ని దాటవేశారు. 24,135 ఓట్లే ప్రామాణికమంటూ తేల్చారు. ఇందులో చెల్లని ఓట్లు 494 పోనూ మొత్తం 23,641 ఓట్లుగా తేల్చారు.

## పట్టభద్రుల స్థానంలో ఉత్కంఠ

పట్టభద్రుల స్థానంలో బ్యాలెట్ పత్రాలను సరిపోల్చే ప్రక్రియే ఇంకా కొనసాగుతోంది. మొత్తం 499 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు ఉండగా సోమవారం అర్ధరాత్రి వరకు సుమారు 250 పోలింగ్ కేంద్రాలకు చెందిన డబ్బాలను మాత్రమే తెరిచారు. మొత్తం 2,50,106 పోలైన ఓట్లలో ఇప్పటి వరకు దాదాపుగా లక్ష బ్యాలెట్ పత్రాలను సరిచూస్తే అందులో 8వేల పైచిలుకు చెల్లనివే వచ్చాయి. దీంతో మిగతా అన్ని బ్యాలెట్ పత్రాల పరిశీలన పూర్తయ్యేసరికి మరో 10వేల వరకు తిరస్కరణకు గురయ్యే అవకాశముందనే భావనను అభ్యర్థులే వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఓటర్లు కనీసం '1' అంకెను సరిగ్గా వేయలేకపోయారు. కొన్ని బ్యాలెట్లలో ఒకటి అంకెను ఇద్దరు ముగ్గురికి వేయడం, టిక్ కొట్టడం, ఓకే అని రాయడం, అభ్యర్థి ఫొటో పక్కన మార్క్ చేయడం లాంటి తప్పిదాలతో చెల్లుబాటు కాలేదు. ఎన్నికల సిబ్బంది ఇచ్చిన ఊదారంగు స్కెచ్ పెన్ను కాకుండా ఓటర్లు తాము తెచ్చుకున్న ఓటుతో ప్రాధాన్యం ఇవ్వగా అలాంటి ఓట్లు కూడా చెల్లలేదు. బ్యాలెట్ పత్రంలో 01 పెట్టి ఓటు వేసినా, ఓటర్లు తమ పెన్నుతో నంబరు వేసిన బ్యాలెట్‌లను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి రవీందర్ సింగ్‌లు కోరారు.



# ఇక్కడ థర్మల్.. అక్కడ సౌర విద్యుత్ ప్లాంట్లు

## ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి

**హైదరాబాద్:** రాజస్థాన్ ప్రభుత్వ విద్యుత్ సంస్థ (ఆర్‌వీఎన్‌ఎల్)తో సింగరేణి చరిత్రాత్మక ఒప్పందం చేసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సోమవారం జైపూర్‌లో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, భట్టిల సమక్షంలో.. సింగరేణి సీఎండీ బలరాం, రాజస్థాన్ ఇంధనశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఆలోక్ అవగాహన ఒప్పందం(ఎంఓయూ)పై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ మేరకు రెండు సంస్థలూ కలసి కొత్తగా ఒక ఉమ్మడి భాగస్వామ్య (జాయింట్ వెంచర్) కంపెనీని ఏర్పాటు చేస్తాయి. ఇందులో సింగరేణికి 74, ఆర్‌వీఎన్‌ఎల్‌కు 26 శాతం వాటాలుంటాయి. రాజస్థాన్ వాటా కింద భూములను కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. సింగరేణి వాటా కింద పెట్టుబడి సొమ్మును సమకూర్చాలని నిర్ణయించారు. ఈ కొత్త కంపెనీ తరఫున మొత్తం రూ.26,200 కోట్ల పెట్టుబడులతో తెలంగాణలో 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి ప్లాంటును, రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి ప్లాంటును ఏర్పాటుచేస్తారని భట్టి ప్రకటించారు. "తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణి వ్యాపార విస్తరణలో ఇదో గొప్ప ముందడుగు. ఈ ఒప్పందంతో సింగరేణి ఆర్థిక పరిపుష్టికి అతిపెద్ద అవకాశం లభిస్తుంది. తొలిసారిగా ఇతర రాష్ట్రాల్లో అతిపెద్ద సోలార్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేయనుండటంతో జాతీయస్థాయి కంపెనీగా సింగరేణికి గుర్తింపు లభిస్తుంది. దీర్ఘకాలంలో తెలంగాణ విద్యుత్ డిమాండ్, అవసరాలను తీర్చడానికి ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుంది. రెండు భారీ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు వల్ల తెలంగాణకు సుస్థిర ఇంధన భద్రత కల్పించడానికి ఇది తోడ్పడుతుంది. విద్యుదుత్పత్తి వ్యయం తగ్గించడానికి వనరులు అందుబాటులో ఉన్న రెండు రాష్ట్రాల్లో రెండు రకాల ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. బొగ్గు లభ్యతతో తెలంగాణలో థర్మల్ ప్లాంటు, ఏడాదిలో ఎక్కువ రోజులు సూర్యరశ్మి, భూముల లభ్యతతో రాజస్థాన్‌లో సౌరవిద్యుత్ ప్లాంటు ఏర్పాటుచేస్తున్నాం" అని భట్టి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల ఆకాంక్షల సాధనకు బీజేపీ కృషి చేస్తుంది

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:** ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన మల్క కొమరయ్యకు కేంద్ర మంత్రి, రాష్ట్ర భాజపా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, సామాజికవేత్త అయిన మల్క కొమరయ్య విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలకు, తెలంగాణ ప్రజలకు భాజపా విజయానికి కృషిచేసిన కార్యకర్తలకు, ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఏ ఆకాంక్షల కోసమైతే, ఉపాధ్యాయులు బీజేపీను గెలిపించారో.. వాటి సాధనకు పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.

## చరిత్రాత్మక తీర్పు ఇది

## బండి సంజయ్

ఉపాధ్యాయులు ఇచ్చిన ఈ తీర్పు చరిత్రాత్మకమైనదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లో లెక్కింపు కేంద్రం వెలుపల బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్యను అభినందించారు. ఎమ్మెల్సీగా గెలిపించిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, భారాస కుమ్మక్కై కుట్రలు చేసినా భాజపా అభ్యర్థి విజయం సాధించారన్నారు. ఉపాధ్యాయులకు హ్యాట్సాఫ్ అని చెప్పారు. 317 జీవో కోసం భాజపా చేసిన పోరాటం ఫలితంగా ఈ విజయం



దక్కిందన్నారు. భాజపా నాయకులు కార్యకర్తలు గెలుపు సంబరాల్లో మునిగితేలారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్‌రావు, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా ఆయకట్టుకు.. గోదావరి జలాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న మొదటి పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోత ప్రారంభం కాగా ఆదివారం రాత్రికి ములకలపల్లి మండలం పూసుగూడెంలోని రెండో పంప్‌హౌస్‌కు గోదావరి జలాలు చేరుకున్నాయి. అక్కడి నుంచి సోమవారం రాత్రికి కమలాపురంలోని మూడో పంప్‌హౌస్‌కు చేరాయి. ఈ నీటిని జూలూరుపాడు వద్ద ప్రధాన కాలువ నుంచి రాజీవ్ లింక్ కాలువ ద్వారా వైరా జలాశయంలోకి మళ్లించనున్నారు. సీతారామ ప్రధాన కాలువ పనులు ఆలస్యం కావడంతో గోదావరి నీటిని సాగర్ ఎడమ కాలువకు మళ్లించడానికి గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.96 కోట్లతో రాజీవ్ అనుసంధాన కాలువను నిర్మించింది. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ 100.22 కి.మీ. నుంచి నిర్మించారు. 8.60 కి.మీ. పొడవున్న ఈ కాలువ సాగర్ ఎడమ కాలువకు 52.29 కి.మీ. వద్ద అనుసంధానమవుతుంది. వైరా, లంకసాగర్ ఇతర చిన్న జలాశయాల్లోకి దీని ద్వారా గోదావరి జలాలు చేరతాయి. ఏటా కృష్ణా నీరు అందక సాగర్ కాలువ చివరి ఆయకట్టులో సాగు కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో 9 మీటర్ల వెడల్పుతో నిర్మించిన రాజీవ్ లింక్ కాలువ ద్వారా ఇకపై నీటిని అందించనున్నారు. వందేళ్ల క్రితం 2.52 టీఎంసీల సామర్థ్యంతో వైరా రిజర్వాయర్ నిర్మించారు. సాగుతోపాటు తాగునీటికి కూడా ఈ జలాశయం కీలకంగా మారింది. సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టు, మిషన్ భగీరథ ద్వారా వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో 450కుపైగా గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఏటా వేసవిలో ఈ జలాశయ నీటి మట్టం పడిపోతున్న క్రమంలో గోదావరి జలాలతో నింపడం ద్వారా ఇకపై సాగు, తాగునీటి ఇక్కట్లు తొలగిపోయినట్లేనని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నేటి నుంచి మీనాక్షి సమీక్షలు

## లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పనితీరుపై ఆరా



**హైదరాబాద్, మార్చి 3 :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పనితీరుపై మంగళవారం నుంచి గాంధీభవన్‌లో ఏఐసీసీ కొత్త ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సమీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో పార్టీ పనితీరును తెలుసుకునే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం మెదక్, మల్కాజిగిరిబీ బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో పార్టీ నేతలందరితో ఆమె సమీక్షించనున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగే సమీక్షలకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీలు, ఇతర ముఖ్యనేతలందరూ రావాలని పీసీసీ ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తరవాత మీనాక్షి నిర్వహించబోతున్న తొలి సమీక్ష సమావేశాలు కావడంతో నేతలంతా వీటికి ప్రాధాన్యమిస్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఎమ్మెల్సీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను ఈ నెల 10లోగా పార్టీ ప్రకటించాల్సి ఉంది. పెద్దసంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. వీటి కోసం కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు, తమ పనితీరును వివరించేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.

**సామాజిక వర్గాలవారీగా..**

ఇటీవల ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం తెలిపినందున ఆ మేరకు ఇకముందు కాంగ్రెస్‌లో పదవుల భర్తీ కూడా ఉ ంటుందని నేతలు చెబుతున్నారు. ప్రధానంగా మాల, మాదిగ వర్గాల నేతలకు ఎమ్మెల్సీ టికెట్లు, నామినేటెడ్, మంత్రి పదవుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ప్రాధాన్యమిస్తారని ప్రచారం జరుగుతోంది. తమకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెండు సామాజిక వర్గాల నేతలు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఒక వర్గానికి అవకాశమిస్తే మరో వర్గానికి ప్రభుత్వ సలహాదారు లేదా రాబోయే మంత్రివర్గ విస్తరణలో సర్దుబాటు చేయాలనే డిమాండు వినిపిస్తోంది. ఇక బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లలో రెండు ఇవ్వాలని ఈ వర్గాల నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తయితే ఏయే వర్గాలకు అవకాశం ఇస్తారనేది తేలుతుంది. మిగిలిన సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారని తెలుస్తోంది. పీసీసీ రాష్ట్ర కార్యవర్గ కూర్పు కూడా ఈ నెల 20లోగా పూర్తవుతుందని పార్టీ వర్గాల అంచనా. నామినేటెడ్ పదవుల్లో మిగిలిన వాటిని భర్తీ చేయడానికి జిల్లాలవారీగా ఈ నెల 10లోగా అర్హులను గుర్తించాలని ఇన్‌ఛార్జి మంత్రులకు పీసీసీ ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. ఇన్‌ఛార్జి మంత్రులు ఆ వివరాలు సేకరిస్తున్నారు. సమీక్ష సమావేశాల్లో నేతల పనితీరుపై కొత్త ఇన్‌ఛార్జి వివరాలు అడుగుతారని సమాచారం. పైరవీలు చేయించుకునేవారిని కాకుండా క్షేత్రస్థాయిలో ఎవరు గట్టిగా పనిచేస్తున్నారనేది కూడా తానే స్వయంగా తెలుసుకుంటానని మీనాక్షి చెప్పినట్లు సమాచారం. అందుకే సమీక్షలతో ఆమె రాష్ట్రంలో పని ప్రారంభిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## సొల్లు కబుర్లు మాని పాలనపై దృష్టి పెట్టు

### సీఎం రేవంత్‌పై మండిపడ్డ ఎంపీ అరవింద్



**నిజామాబాద్, మార్చి 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనికిమాలిన రాజకీయాలు మానుకోనీ ప్రజా పాలనపై దృష్టి సారించాలని ఎంపీ ధర్మపురి అరవింద్ సీఎం కు హితవు పలికారు. కేవలం ప్రజలను మభ్య పెట్టడానికి సీఎం సొల్లు పురాణం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రాజెక్టుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకున్నారనే విషయమై స్పష్టత ఇవ్వా లని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ ధర్మ పురి అరవింద్ తీవ్రంగా ఖండిస్తూ సోమవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు . ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై పదేపదే సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉ న్నాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రం లో ప్రాజెక్టులకి అడ్డుపడు తున్నారని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. ప్రధాని మోడీ మంచి వారే.. కానీ కిషన్ రెడ్డి మంచి వారు కాదు అని చెప్పడ మేమిటి అని ప్రశ్నించారు. ప్రాజెక్టులకు సంబంధించి ఇవ్వాల్సిన స్థలాలను, అదేవిధంగా రాష్ట్ర ప్రభు త్వం ఇవ్వా ల్సిన వాటాని ఇస్తున్నావా.. రాష్ట్ర ప్రభు త్వం చేయాల్సిన ఫార్మా లిటీస్ అన్ని పూర్తి చేస్తు న్నావా అని సీఎం రేవంత్ రెడ్డిని ఎంపీ ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాలకు సమా నంగా నిధులు ఇస్తున్నా రని చెప్పారు. ఏక్కడ కూడా వివక్ష చూప లేద న్నారు. అసలు ప్రధాని మోడీ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమిస్తలేరు.. కిషన్ రెడ్డి ఏ విషయంలో అడ్డుకుంటు న్నా రనే దానిపై ప్రజల ముందుకు తీసుకురా వాలి కానీ సీఎం రేవంత్ రెడ్డి సొల్లు పురాణం చేయడమేమిటిని ప్రశ్నిం చారు. అసలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో సీఎం సమాధానం చెప్పా లన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం పై తెలంగాణ రాష్ట్ర ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని విమర్శిం చారు. ప్రధాని మోదీ పాలనలో తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి అన్యా యం జరగలేదని తెలిపారు.ప్రాజెక్టులపై ప్రధాని మో డీని సీఎం రేవంత్ రెడ్డి కలవడం సంతోషమే కానీ రాష్ట్రంలో ప్రాజెక్టులకు అడ్డుకుంటు న్నారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభు త్వానికి సంబంధించి ప్రాజె క్టులు అడ్డుకుంటున్నారనే విషయమై అధికారులతో కలిసి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి వస్తాం ప్రజల ముందే తేట తెల్లం చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ సిఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.



## తెలంగాణలో సీఎం మార్పు తథ్యం

### కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మార్పే దీనికి నిదర్శనం

### బిజెఎల్‌పి నేత ఏలేటి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మార్చి 3 :** తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మారారంటే.. ఇక మారేది ముఖ్యమంత్రేనని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ టీమ్ నుంచి కొత్త ఇంఛార్జిని పెట్టారన్నారు. సోమవారం ఆయన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. 'సీఎం ఛేంజ్ అనే మిషన్‌ను మీనాక్షి నటరాజన్‌కు అప్పగించారు. సీఎంను మార్చేందుకు ఆమె గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్‌లో ముఖ్యమంత్రి మార్పు ఖాయం. వనపర్తి సభలో ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ఇంకా పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్ చెప్పారు. ఆడబిడ్డల ఆశీర్వాదం కంటే.. ఢిల్లీ నుంచి వచ్చిన ఆడబిడ్డ ఆశీర్వాదం ఆయనకు ముఖ్యం. కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా గాడి తప్పింది. మంత్రుల తీరు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంది. ఒక్క మంత్రి కూడా సీఎంని ఖాతరు చేయడంలేదు' అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇన్‌చార్జీ మారిందంటే ఇంకా మారేది సీఎం రేవంత్ రెడ్డేనని ఆయన స్పష్టం చేశారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 'మిషన్ సీఎం చేంజ్' టాస్క్‌ను మీనాక్షి నటరాజన్‌కు అప్పగించారని తెలిపారు. అయితే గతంలో తాను ఇదే విషయాన్ని స్పష్టం చేశానని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబర్‌లోపు ముఖ్యమంత్రి మార్పు తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. కుంభకోణాలతోపాటు ఇతర ట్యాక్స్‌లపై కాంగ్రెస్ పార్టీలో కథలు, కథలుగా చెప్పుకొంటున్నారన్నారు. అయితే కేబినెట్‌లో కలహాలు నడుస్తున్నాయని తెలిపారు. ఆడబిడ్డల ఆశీర్వాదం అంటే తెలంగాణ ఆడబిడ్డలు కాదని.. ఢిల్లీ ఆడబిడ్డ మీనాక్షి నటరాజన్ చేతిలో తన భవిష్యత్తు ఉందని రేవంత్ రెడ్డి చెప్పకనే చెప్పారంటూ ఆయన వ్యంగ్యంగా అన్నారు. సీఎం మార్పుపై గ్రౌండ్ ప్రిపేర్ చేయడానికి మీనాక్షి నటరాజన్ తెలంగాణకు వచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మార్చి కేబినెట్‌లోని ఓ నేతలకు ఆ బాధ్యతను అప్పగిస్తారని వివరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి నరం లేని నాలుక … ఎప్పుడు ఏమైనా మాట్లాడుతాడంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుతో పాటు కేబినెట్‌సైతం గాడి తప్పిందని విమర్శించారు. మంత్రులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉన్నారన్నారు. రాజు.. సామంత రాజు తరహాలో వ్యవహరిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఒక్క మంత్రి సైతం తనను లెక్క చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పుకున్నారని గుర్తు చేశారు. ఫిబ్రవరి 17వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లాడని… దాదాపు ఆరేడు నెలల తర్వాత పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇచ్చారని వివరించారు. ఆ తర్వాత బయటకు వచ్చి ఎవరో తన కుర్చీపై కన్నేశారని చెప్పడమంటే.. రాహుల్ గాంధీ ఎలాంటి ఇండికేషన్ ఇచ్చారో అర్థమవుతుందన్నారు. కొందరు మంత్రులు తన సీఎం కుర్చీపై కన్నేశారని.. కేబినెట్ మంత్రులు తన మాట వినడం లేదన్నారు. సీఎంను పని చేయనీయకుండా, ఆయన కుర్చీపై కన్నేసిందెవరని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు.. ఈ కుర్చీపై కన్నేశారా? అని సందేహం వ్యక్తం చేశారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డికి వారు సహకరించడం లేదా? అని సందేహం వ్యక్తం చేశారు. వీరి మధ్య మూటల పంచాయితితోనేనా లేక మరేదైనా కారణముందా? అని ప్రశ్నించారు. ఆ క్రమంలోనే సీఎంను ఎస్ఎల్బీసీ వద్దకు రానీయ లేదన్నారు. తాము వెళ్లి స్టేట్‌మెంట్ ఇస్తే.. ఆ తర్వాత 8 రోజులకు దుర్ఘటన చోటు చేసుకున్న ప్రాంతానికి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారన్నారు. సీఎంకు ఎక్కడికక్కడ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెక్ పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని ఎప్పటి సమాచారాన్ని అప్పుడు ఢిల్లీకి చేరవేస్తున్నది ఉత్తమ్ కుమార్ రెడ్డి అని ఆ పార్టీ నేతలే అనుకుంటున్నారన్నారు. అంతేకాదు.. సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దొరకకుండా చేస్తున్నది సైతం ఉత్తమ్ కుమార్ రెడ్డేనని ఆ పార్టీ నేతలే చెబుతున్నారని గుర్తు చేశారు.తెలంగాణలో పార్టీ ఇన్‌ఛార్జిని మార్చడంలో ప్రధాన భూమిక, మాస్టర్ ప్లాన్ అంతా ఉత్తమ్ కుమార్ రెడ్డిదేనని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డితో గిఫ్ట్‌లు తీసుకొని సపోర్ట్ చేస్తుందని ఓ చర్చ సైతం పార్టీలో సాగుతోందన్నారు.

## హామీలు అమలు చేయకపోతే 10వేల మహిళలతో గ్రామాల్లోకి వెళ్తారు

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మాటెటుపోయింది..?
- మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పాత్ర శూన్యం
- బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** మహిళలకు ఇచ్చిన హామీల సాధనకై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభిం చామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం రేవంత్ మాటలు ఉత్తవేనని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ.2500 వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లలో లక్ష కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ వట్టిదేనని చెప్పారు.జాగృతి మహిళా కార్యకర్తల నుంచి సేకరించిన 10 వేల పోస్టుల కార్డులను సీఎం రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హామీల అమలుపై మార్చి 8న ప్రకటన చేయకపోతే 10 వేల మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామన్నారు. లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని చెప్పారు. మహిళల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని విమర్శించారు. ఆడబిడ్డల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తుచేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీలేదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. వరంగల్ విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవీ పేరు పెట్టాలడి డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాము కూడా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం ప్రకటనకు, ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్‌కు పోలిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్పా పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశంలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇచ్చే కార్యక్రమాన్ని మొదలుపెడితే ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. మార్చి 8న ఈ పథకాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం అందంగా అబద్ధాలు చెబుతున్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఎగ్గొట్టిందని విమర్శించారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వడ్డీ రాయితీ బకాయిలు విడుదలతో పాటు రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలన్నారు. భర్త చనిపోయిన మహిళలకు కొత్తగా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలన ఉన్నప్పుడు వస్తున్న పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కొత్తగా పెన్షన్‌దారులను నమోదుచేయడం లేదన్నారు. తక్షణమే పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచడంతోపాటు, అభయ హస్తం నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. నేరాల శాతం 20 శాతం పెరిగాయని డీజీపీ వెల్లడించారు. ఆడబిడ్డలకు రక్షణపై ప్రభుత్వం సమీక్షించి ప్రకటన చేయాలన్నారు. కేసీఆర్ కిట్ పంపిణీని నిలిపివేసి కాంగ్రెస్ పార్టీ మానవత్వాన్ని మంటకలిపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసీఆర్ కిట్‌ను కొనసాగించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. మహిళా కార్మికులను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మహిళా కార్మికులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వం ధాంబికాలు పలుకుతున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే ఆ పోస్టులను సృష్టించారని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఆడపిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ చేయడం లేదని, దీంతో తల్లిదండ్రులు వారిని చదువు మానిపిస్తున్నారని తెలిపారు.

## ఆస్తి కోసం తల్లిని హత్య చేసిన తనయుడు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని కనికరం ఓ కసాయి హత్య చేశాడు. ఆస్తి కోసం కన్నతల్లినే కర్కశంగా కత్తితో పొడిచి చంపాడు. వివరాల్లోకి వెళ్తే… తెల్లాపూర్ దివినో విల్లాస్‌లో నివాసముం టున్న రాధిక (52) ను ఆమె కొడుకు కార్తీక్ రెడ్డి సోమవారం ఉదయం ఆస్తి కోసం తల్లితో గొడవ పడ్డాడు. ఈక్రమంలో తల్లిపై కత్తితో దాడి చేసి ఎనిమిదిసార్లు పొడిచాడు. గమనించిన స్థానికులు రాధికను హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాధిక మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తిక్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుడు మత్తు పదార్థాలు సేవిస్తూ, మద్యానికి బానిసైనట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే..

### తెలంగాణ రాష్ట్ర సర్కార్ మరో షాకింగ్ నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** తెలంగాణ రాష్ట్ర సర్కార్ మరో షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఈఏపీసెట్‌కు సంబంధించి కన్వీనర్ కోటా సీట్లను నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో 100 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకే రిజర్వుచేస్తూ జీవో జారీ చేశారు. అయితే తాజాగా ఏపీలో ఈ పరీక్ష సెంటర్లను కూడా రద్దు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్న హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష కేంద్రాలను తొలగిస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. తొలుత ఏపీలోని విజయవాడ, కర్నూలు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది. అయితే ఏపీ విద్యార్థులు పోటీపడేందుకున్న 15 శాతం స్థానికేతర సీట్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన తర్వాత.. పరీక్ష కేంద్రాల రద్దు నిర్ణయం తీసుకుంది. ప్రతీయేట తెలంగాణ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇంజనీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు దాదాపు 55 వేలకుపైగా అప్లికేషన్లు వచ్చేవి. ఏపీ నుంచి 3 వేలకు పైగా దరఖాస్తులు వచ్చేవి. అధిక మొత్తంలో ఏపీ విద్యార్థుల నుంచి రిజిస్ట్రేషన్లు వస్తున్నందున కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరులలో కేంద్రాలతో పరీక్షను నిర్వహిస్తూ వచ్చింది. ఈఏపీసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొత్తం 5,010 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజినీరిం గ్‌కు 3,116 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 1891 మంది, రెండు పరీక్షలకు హాజరయ్యేందుకు ముగ్గురు చొప్పున విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సవరణలకు ఏప్రిల్ 6 నుంచి 8 వరకు అవకాశం ఇస్తారు. అభ్యర్థులు రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 9వరకు. రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 14 వరకు, రూ.2,500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 18 వరకు, రూ.5 వేల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 24 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇక వ్యవసాయ, ఫార్మసీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29, 30 తేదీలలో జరుగుతుంది, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష మే 2 నుంచి 5 వరకు ఉంటుంది.

## సొరంగం తవ్వడం చేతకాక బీఆర్ఎస్‌పై నిందలు : కేటీఆర్



**హైదరాబాద్, మార్చి 3 :** 'ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి 12 కి.మీ. టన్నెల్ పూర్తిచేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటు' అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'గత 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కనబెట్టి తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలని ప్రయత్నించడం అత్యంత దుర్మార్గం. కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, నాలుగు రోజులు కాకముందే ఎనిమిది మంది అమాయకుల నిండు ప్రాణాలను పణంగా పెట్టిన పాపం ముఖ్యమంత్రిదే. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లైతే 2005–2014 మధ్యలో కాంగ్రెస్ సర్కారు తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లే. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కి.మీ. మేర టన్నెల్ పనులు పూర్తి చేసిన చరిత్ర భారాస ప్రభుత్వానిది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడున్నరేళ్లలో 203 కి.మీ. టన్నెళ్లు తవ్వినా ఎలాంటి ప్రమాదం జరిగిన దాఖలా లేదు. చేసిన తప్పును ఒప్పుకోవడం తప్ప ముఖ్యమంత్రి ముందు మరో మార్గం లేదు. ఈ దృష్టి మళ్లింపు రాజకీయాలు తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవు' అని కేటీఆర్ పేర్కొన్నారు.



## మత్స్యావతారంలో స్వామివారు

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 3 :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 3వ రోజు సోమవారం స్వామి వారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహన సేవలో తిరుమాఢ వీధుల్లో ఊరేగారు. సాయంత్రం నిత్యహోమం, చతు స్థానార్చనలు నిర్వహించారు. వైకుంఠంలో స్వామివారికి నిరంతరం సేవా కైంకర్యాలు చేసిన వ్యక్తి అనంతుడు. అతనే ఆది శేషు. అలాంటి ఆదిశేషుడిలో ప్రవాసుదేవుడిలా స్వామివారిని అలంకరించి ఆస్థానం చేశారు. వేదాలు, పురాణాలతో ప్రార్థించారు. భక్తజన బాంధవుడు లక్ష్మీనారసింహుడు ప్రీతిపాత్రమైన శేష వాహనుడిపై తిరు మాఢ వీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవ శుభరాత్రుల్లో యాదగిరిగుట్ట కొండపై జ్వాలాకృతిలో సర్పాకారంలో వెలసిన స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఆదిశేష వాహనాన్ని భక్తులు కనులారా దర్శించుకున్నారు.

## ప్రమాదవశాత్తు కారులో మంటలు

**యాదగిరిగుట్ట, మార్చి 3 :** గజ్వేల్ నుంచి భువనగిరి వెళ్లే దారిలో ప్రమాదవశాత్తు కారులో మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాదగిరిగుట్టకు దైవ దర్శనం కోసం కొందరు కారులో బయల్దేరారు. తుర్కపల్లి సమీపంలోకి రాగానే కారు ముందు భాగం నుంచి పొగలు వచ్చాయి. ఇది గమనించిన డ్రైవర్.. కారులోని ప్రయాణికులను అప్రమత్తం చేశారు. అందరూ వెంటనే కారులోంచి దిగిపోవడంతో ముప్పు తప్పింది. ఘటనపై స్థానికులు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజిన్‌తో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అదే సమయంలో అటుగా ప్రయాణిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎవరికైనా ప్రమాదం జరిగిందా? అని ఆరా తీశారు.

## రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడి

### 10వేలు లంచం తీసుకుంటుండగా సబ్ రిజిస్ట్రార్‌ను పట్టుకున్న అధికారులు

**నిజామాబాద్, ఫిబ్రవరి 3 :** రూ.10 లంచం తీసుకంటూ ఓ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కన సంఘటన నిజామాబాద్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కవితా కాంప్లెక్స్ రెండవ అంతస్తులో ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి కి సంబంధించిన ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్టర్ శ్రీరామరాజు సదరు వ్యక్తి వద్ద నుంచి రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయంపై దాడి చేసి లంచం డబ్బులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న శ్రీరామరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# ఎన్నికల సంఘం విశ్వసనీయతపై నీలినీడలు !




ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసుకోగలం. నేటికీ పటిష్ట మైన విధానాలు లేదా, విదులు లేకుండా పోయాయి. ఇసి అండతో బోగస్ ఓట్లు సృష్టించారని ఇటీవల బెంగాల్ సిఎం మమతా బెనర్జీ పదేపదే ఆరోపిస్తున్నారు. అయితే దీనిపై ఇసి కూడా పెద్దగా స్పందించలేదు. పటిష్టమైన ఓటు నమోద్ కార్యక్రమం జరగడం లేదు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్లు పక్కాగా ఉంటున్నా, ఓటర్ కార్డు మాత్రం పక్కాగా ఉ ౦డడం లేదు. ఇకపోతే ఎన్నికల వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం లేదని చెప్పుకుంటున్నా..అది పెద్దగా ప్రభావం చూపే అంశం కాదు. ఎందుకంటే ఎన్నికల కమిషన్ మొత్తం కేంద్రం కనుసన్నల్లోనే సాగుతోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, బిజెపి అధికారులో ఉన్నా అదే జరుగుతోంది. ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషన్ నియామకం చూస్తే విషయం మరోమారు అర్థం చేసుకో వచ్చు. నిజానికి అప్పుడప్పుడూ సుప్రీంకోర్టు జోక్యం ద్వారా మనదేశ ప్రజాస్వామ్యం బలపడుతోంది. నిరంకుశ పాలకుల కబంధ హస్తాల్లోంచి వ్యవస్థలను రక్షించుకునే అవకాశం వస్తోంది. అయితే సుప్రీం తీర్పులను కూడా కాలరాస్తున్నాం. కోర్టులు,ధర్మాసనాలు ఇచ్చే తీర్పులను బేఖాతర్ చేస్తున్నాం. ఎన్నికల సంఘం నియామకాలపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం రెండేళ్ల క్రితం ఇచ్చిన ఆదేశాలు మోడీ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించకపోవడం, ఎన్నికలను సజావుగా నిర్వహించక పోవడం వంటి ఆరోపణలను ఇసి ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం రెండేళ్ల క్రితం ఇచ్చిన తీర్పు మేల్కొలుపు లాంటిది. ఏకపక్షంగా తమ ఇష్టంవచ్చిన వారిని ఎన్నికల కమిషనర్లుగా నియమించడం, వారు మోడీ కనుసన్నల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి.ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు,ఎన్నికల కమిషనర్ల నియామకాలపై సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువ రించింది. ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్షనేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉన్న త్రిసభ్య కమిటీయే ఎన్నికల సంఘంలో నియామకాలను చేపట్టాలని స్పష్టం ఆదేశాలు ఇచ్చింది. అదే విధంగా నిరంకుశంగా వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న పాలకులకు వార్నింగ్ లాంటిదని అంతా అనుకున్నారు.

శక్తివంతమైన తుపాకీ కన్నా ఓటు చాలా శక్తివంత మైనదని ధర్మాసనం తన తీర్పులో పేర్కొన్నారు. బలహీనంగా ఉన్న వ్యక్తిని ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కూడా ఆనాడు ధర్మాసనం వ్యాఖ్యానించింది. దేశంలోని చట్టసభలకు ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన ఎన్నికల సంఘం నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. కొన్ని లోపాలు, లొసుగులు వున్నప్పటికీ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించటంలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను నిరూపించుకోవాలి. అయితే ఈ తీర్పును మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇటీవల ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా కేరళ కేడర్‌కు చెందిన ఐఎఎస్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండాల్సిన కమిటీని కేంద్రం పట్టించుకోలేదు. దీనిపై మరోమారు సుప్రీంలో కేసు నడుస్తోంది. ఇది తేలాల్సి ఉంది. ఈలోగా రాజీవ్ కుమార్ పదవీకాలం ముగియడంతో ఎంపిక అనివార్యం అయ్యింది. అయితే వ్యవస్థలను భ్రష్టు పట్టించడం అన్నది కాంగ్రెస్ జమానా నుంచే ప్రారంభం అయ్యింది. దేశాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిన కాంగ్రెస్, తదుపరి పాలకులకు బాటలు వేసింది. అయితే ఇటీవలి కాలంలో ఎన్నికల నిర్వహణలో కమిషన్ వ్యవహరిస్తున్న తీరు పలు ప్రశ్నలకు తావిస్తోంది. బరిలో నిలిచిన అన్ని పార్టీల మధ్య సమతుల్యత పాటిస్తూ ఎన్నికల్లో ధన బలం వినియోగాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన కమిషన్ తన కర్తవ్య నిర్వహణలో విఫలం కావడం క్షంతవ్యం కాదు. సుప్రీం ఆదేశాల మేరకు కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమిం చాలన్న ఆదేశాలతో పటిష్ట ఎన్నికల సంఘం నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రాలేదు. ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చన తీర్పు వ్యవస్థలను కాలరాస్తున్న వారికి గుణపాఠం కావాలి. అది బిజెపి కావచ్చు..లేదా ఇతర ప్రాంతీయ పార్టీలు కావచ్చు..ఇదో హెచ్చరికగా గుర్తించాలి. సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం కొలీజియం వంటి వ్యవస్థను రూపొందించాలన్న సూచనను స్వాగతించాల్సిందే. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అత్యంత పారదర్శకంగా ఉండాలి. పారదర్శకత లేకపోతే వినాశకర పరిణామాలకు దారితీస్తుంది. ఎన్నికల కమిషన్ న్యాయబద్ధంగా, నిజాయితీగా వ్యవహరించాల్సి ఉంది. నిజానికి ఇసి తీరు ఈ మధ్య దిగజారిందన్న విమర్శలు ఉ న్నాయి. ఎన్నికల్లో పెరుగుతున్న ధనబలం, నేరపూరిత రాజకీయాలు వంటి అంశాలపై కఠినంగా వ్యవహరించలేక పోతున్నది. అధికారంలో ఉన్న పార్టీ అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండేందుకు ఎన్నికల కమిషన్‌ను ఒక పావుగా వాడుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంది. ఇసి స్వతంత్రంగా ఎన్నికల నిర్వహణ అన్నది కేవలం శేషన్ హయాంలో మాత్రమే జరిగింది. ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించేలా ఎన్నికల పక్రియ స్వచ్ఛతను కాపాడుకోవాల్సిన అవసరముంది. సిబిఐ అధిపతి, లోక్‌పాల్ నియామకాల తరహాలోనే సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకం జరగాలి. పలు సందర్భాల్లో లక్షల వరకు ఓట్లు గల్లంతు అయినట్లుగా ఆరోపణలు వచ్చాయి. అనేకసార్లు అక్రమాలు, అవకతవకలు బయటపడ్డాయి.

ఎన్నికల కమిషన్‌ను పూర్తి స్థాయిలో సంస్కరించి దాని సమగ్రతను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వం, అధికార పార్టీ ప్రభావం పడకుండా రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవడం అవసరం. దీనితో పాటు పదవీ విరమణ చేసిన ఎన్నికల కమిషనర్లు తరువాత ప్రభుత్వ పదవుల్లో అంటే గవర్నర్లుగానో, చట్టసభల సభ్యులుగానో నియమితులు కావటాన్ని కూడా నిషేధించాలి. ఇసి నిష్పక్షపాతంగా వ్యవహరించే విధంగా చట్టాన్ని పటిష్టంగా, మరింత పారదర్శకంగా రూపొందించుకోవాలి. ఓటరు కార్డు ఉన్నా ఓట్లు గల్లంతవుతున్న తీరుకు అడ్డుకట్టు పడాలి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ప్రజలు కూడా స్వేచ్ఛగా తాము కోరుకున్న పార్టీకే ఓటేస్తారు. సరైన వ్యక్తులను ఎన్నుకుంటారు.

# ఆర్‌బీఐకి పేటీఎం సరైన సమాచారం ఇవ్వలేదు

## రూ.611 కోట్ల నోటీసుపై ఈడీ




**న్యూఢిల్లీ, మార్చి 3 :** వివిధ అంశాల్లో ఫెమా (విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్ట) నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను పేటీఎం మాతృసంస్థ, ఆ కంపెనీ ఎండీ, అనుబంధ సంస్థలకు రూ.611 కోట్ల షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్( ఈడీ) సోమవారం వెల్లడించింది. పేటీఎం వార్షిక నివేదిక ప్రకారం కంపెనీ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మనే ఛైర్మన్, ఎండీ, సీఈఓగానూ ఉన్నారు. న్యాయ ప్రక్రియ మొదలుపెట్టడానికి ముందు ఈడీకి చెందిన ఒక ప్రత్యేక డైరెక్టరు ఈ నోటీసు జారీ చేశారు. పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ లిమిటెడ్ (ఓసీఎల్)తో పాటు ఆ సంస్థ ఎండీ, అనుబంధ కంపెనీలు లిటిల్ ఇంటర్నెట్, నియర్‌బై ఇండియాలకు రూ.611 కోట్ల షోకాజ్ నోటీసు పంపినట్లు ఈడీ తెలిపింది.

**ఇవీ ఆరోపణలు:** 'సింగపూర్‌లో ఓసీఎల్ విదేశీ పెట్టుబడులు పెట్టినట్లు దర్యాప్తులో తేలింది. ఓవర్‌సీస్ స్టెప్-డౌన్ అనుబంధ కంపెనీ ఏర్పాటుకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని ఆర్‌బీఐకి ఆ సంస్థ వెల్లడించలేదు. ఓసీఎల్ కూడా సరైన మార్గదర్శకాలను పాటించకుండా విదేశీ మదుపర్ల నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను పొందింది. లిటిల్ ఇంటర్నెట్ సైతం ఆర్‌బీఐ నిబంధనలను పాటించకుండా ఎఫ్‌డీఐ పొందింది. ఆర్‌బీఐ పేర్కొన్న గడువులోగా ఎఫ్‌డీఐ సమాచారాన్ని నియర్‌బై ఇవ్వలేద'ని ఈడీ తెలిపింది. స్టాక్‌ఎక్స్ఛేంజీకి 'కొన్ని పెట్టుబడుల లావాదేవీలకు సంబంధించి ఫెమా నిబంధనల ఉల్లంఘనకు గాను ఈడీ నుంచి నోటీసులు అందాయ'ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పేటీఎం సమాచారం ఇచ్చింది. ఉల్లంఘనకు పాల్పడిన సమయంలో ఆ రెండు కంపెనీలు తమ అనుబంధ కంపెనీలుగా లేవనీ, 2017లో వాటిని తాము కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే పేటీఎం ఇంట్రాడేలో రూ.685 వద్ద కనిష్ఠానికి చేరింది. మళ్లీ కోలుకుని 1.38% లాభంతో రూ.726.20 వద్ద ముగిసింది.

**పేటీఎం ప్రతినిధి ఏమంటున్నారంటే:** ఓసీఎల్ రూ.245 కోట్లకు పైగా, లిటిల్ ఇంటర్నెట్ రూ.345 కోట్లు, నియర్‌బై ఇండియా రూ.21 కోట్ల లావాదేవీలకు సంబంధించిన ఉల్లంఘనలకు జరిగినట్లు నోటీసుల్లో ఉంది. ఇందుకు సంబంధించిన చట్టాలు, నియంత్రణ ప్రక్రియల ఆధారంగా సమస్యను పరిష్కరించడానికి కంపెనీ పనిచేస్తోంది. అత్యున్నత ప్రమాణాలు, పాలనను కొనసాగిస్తున్నట్లు పేటీఎం ప్రతినిధి ఒకరు తెలిపారు.

# త్వరలో రోడ్లపైకి హైడ్రోజన్ ఇంధన వాహనాలు!

- 5 ప్రయోగాత్మక ప్రాజెక్టులకు ఆమోదం
- దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు బాధ్యతలు




**న్యూఢిల్లీ, మార్చి 3 :** జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా, హైడ్రోజన్ ఇంధనంగా వినియోగించే వాహనాలను రహదారులపై నడిపించేందుకు 5 ప్రయోగాత్మక ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 10 రహదారులపైకి బస్సులు, ట్రక్కులతో సహా 37 హైడ్రోజన్ ఇంధన వాహనాలను తీసుకురానున్నట్లు తెలిపింది. టాటా మోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, ఏఎన్‌ఈఆర్‌టీ, అశోక్ లేలాండ్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ వంటి దిగ్గజ కంపెనీలకు ఈ ప్రాజెక్టులను అప్పగించారు. రూ.208 కోట్ల కేటాయింపు: జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా ,రవాణా రంగంలో ప్రయోగాత్మక ప్రాజెక్టులను అమలు చేసేందుకు మంత్రిత్వ శాఖ గతంలో మార్గదర్శకాలు జారీ చేసింది.వివిధ కంపెనీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించాక.. 5 ప్రయోగాత్మక ప్రాజెక్టుల కింద మొత్తం 37 వాహనాలు (బస్సులు, ట్రక్కులు), 9 హైడ్రోజన్ రీఫ్యూయెలింగ్ స్టేషన్లకు అనుమతి మంజూరు చేసింది. 37 వాహనాల్లో 15 హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్-ఆధారిత వాహనాలు కాగా, 22 హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ ఆధారిత వాహనాలు. ఈ ప్రాజెక్టుల కోసం కేంద్రం మొత్తం రూ.208 కోట్లు అందించనుంది. వచ్చే 18-24 నెలల్లో ఈ ప్రాజెక్టులు అమల్లోకి రానున్నాయి.

# అయోధ్యపై ఉగ్రకుట్ర

## భగ్నం చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, మార్చి 3 :** అయోధ్యలోని రామాలయంతోపాటు పలు మతపరమైన సంస్థలపై దాడికి ఉగ్రవాదులు కుట్ర పన్నారు. ఈ కుట్రను గుజరాత్ పోలీసులు భగ్నం చేశారు. గుజరాత్‌కు చెందిన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ పోలీసులు హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల పాలి ఏరియాలో ఒక టెర్రరిస్టును అరెస్టు చేశారు. అతని నుంచి రెండు గ్రెనేడ్‌లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర ఏజెన్సీలు, ఫరీదాబాద్ ఎస్‌టీఎఫ్ తో కలిసి సంయుక్తంగా గుజారాత్ ఏటీఎస్ ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టింది. టెర్రరిస్టుల టా÷-గ్గ÷ట్‌లలో అయోధ్య రామమందిరంపై దాడి చేయడం కూడా ఒకటిగా ఉన్నట్టు పోలీస్ వర్గాలు తెలిపాయి. కాగా ఫరిదాబాద్‌లో అరెస్టయిన టెర్రరిస్టు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల అబ్దుల్ రెహ్మాన్‌గా గుర్తించారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న గ్రెనేడ్‌లను నిర్వీర్వం చేశారు. రెహ్మాన్‌కు టెర్రరిస్టు సంస్థలతో ఉన్న సంబంధం, అతని టార్గెట్‌కు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు అతడిని గుజరాత్‌కు తరలిస్తున్నారు. రెహ్మాన్ అరెస్టు తో భారీ ఉగ్రదాడి కుట్ర భగ్నమైనట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా ఉగ్రవాదుల జాడ కోసం గుజరాత్ ఏటీఎస్ చేపట్టిన సెర్చింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపా రు. అబ్దుల్ రెహ్మాన్ అరెస్ట్ ద్వారా అయోధ్య రామాలయంపై దాడికి కుట్ర పన్నినట్లు బయటపడటంతో అయోధ్యలో హై అలర్ట్ ప్రక టించారు. ముఖ్యంగా రామాలయం దగ్గర భద్రతను పటిష్టం చేశారు.

# చెత్త నిర్ణయాలతో సంక్షోభంలోకి తెలంగాణ

- కరోనా కన్నా డేంజరస్ వైరస్ కాంగ్రెస్
- సీఎం రేవంత్ తప్పిదాల వల్ల పడిపోయిన వృద్ధిరేటు : కేటీఆర్




**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** సీఎం రేవంత్‌రెడ్డి చెత్త నిర్ణయాలతో తెలంగాణ సంక్షోభంలోకి వెళ్లిపోయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కరోనా కన్నా డేంజరెస్ వైరస్ కాంగ్రెస్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏడాది క్రితం చెప్పింది.. ఇవాళ అక్షరాలా నిజమైందని అన్నారు. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్‌లో రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమర్థ సీఎం ఆర్థిక వృద్ధికి గొయ్యితీసి పాతరేశారని విమర్శలు చేశారు. దేశంలోనే అగ్రభాగాన ఉన్న తెలంగాణను ఆఖరికి పడేశారని కేటీఆర్ మండిపడ్డారు. గతేడాది 10 శాతం నమోదైన జీఎస్టీ వసూళ్లు కేవలం ఒకే ఒక్కశాతం వృద్ధికి పడిపోవడం సిగ్గుచేటని అన్నారు. చెత్త నిర్ణయాలతోనే తెలంగాణ ఆర్థిక రంగంలో ఈ విధ్వంసమని చెప్పారు. మతిలేని ముఖ్యమంత్రి ఘోర తప్పిదాల వల్లే ఈ సంక్షోభమని అన్నారు. ప్రభుత్వ పెద్దల కమీషన్లు ఆకాశాన్ని అంటుతుంటే రాష్ట్ర రాబడులు మాత్రం కుప్పకూలడం క్షమించరాని నేరమని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల స్వర్ణయుగాన్ని చెరిపేసి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాసుకునే "చీకటి చరిత్ర" ఇదేనా..అని కేటీఆర్ ప్రశ్నించారు.

# కాంగ్రెస్ హిందూవ్యతిరేక పార్టీ

- అయోధ్య, కుంభమేళాకు హాజరు కాని నేతలు
- విమర్శలు ఎక్కుపెట్టిన బిజెపి

**న్యూఢిల్లీ, మార్చి 3 :** కుంభమేళా, అయోధ్య కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు హాజరు కాకపోవడంపై బీజేపీ మరోమారు విమర్శలు గుప్పించంది. బిజెపి, కాంగ్రెస్ మధ్య మరోసారి మాటల యుద్ధం నడుస్తోంది. ప్రధాని మోడీ గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్‌పై బీజేపీ మాటల దాడి చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గేలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించింది. 2024 లో అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి వారు హాజరకాలేదు. 2025లో మహా కుంభమేళాకు కాంగ్రెస్ నాయకులు హాజరుకాలేదని.. వాళ్లంతా హిందూ వ్యతిరేకులని బీజేపీ ధ్వజమెత్తింది. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఫొటోలు పెట్టి విమర్శలు చేసింది. రాహుల్ గాంధీ కుటుంబం మొత్తం హిందూ మతాన్ని వ్యతిరేకిస్తుంది. వారు బాబర్ నిర్మించిన మసీదుకు మూడుసార్లు వెళ్లారు కానీ రాముడి ఆలయంలో శ్రీరాముని దర్శనం కోసం వెళ్లలేదు. రాహుల్ గాంధీ తరచుగా రాయ్‌బరేలికి వెళ్తారు. కానీ ఆయన ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా జరిగే ప్రదేశానికి వెళ్లలేకపోయారు. ఇది కేవలం 2 గంటల రెండు నిమిషాల 120 కి.మీ. దూరంలో ఉంది' అని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు ఇక హిందీ పోస్టులో బీజేపీ మరో విమర్శ చేసింది. 'శతాబ్దాల పోరాటం మరియు నిరీక్షణ తర్వాత అయోధ్యలో ఒక గొప్ప రామాలయం నిర్మించబడింది. మోడీ చేతుల మీదుగా జనవరి 22, 2024న రామ్‌లాలా ప్రాణ ప్రతిష్ట జరిగింది. కానీ ఆలయ నిర్మాణాన్ని ఎప్పుడూ వ్యతిరేకించే కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఆహ్వానం అందుకున్న తర్వాత కూడా వేడుకకు హాజరు కాలేదు. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును సంతృప్తి పరచుకోవడానికి హిందువుల మనోభావాలను ఎప్పుడూ దెబ్బతీస్తుంది' అని బీజేపీ పేర్కొంది. బీజేపీ విమర్శలను మల్లిఖార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఖండించారు. బీజేపీ వాదన ప్రకారం.. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి వంటి మిత్రపక్షాల నాయకులు కూడా కుంభమేళాకు హాజరుకాలేదు. వీళ్లను కూడా హిందూ వ్యతిరేకులుగా పరిగణించాలా.. అని బీజేపీని ప్రశ్నించారు.

# రంగనాయక్‌సాగర్‌ను పరిశీలించిన అధికారులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 :** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సూచనతో అధికారులు కదిలారు. నిన్న సిరిసిల్లలో పర్యటించిన కేటీఆర్‌ను రంగనాయక సాగర్ నుంచి నీళ్లు ఇప్పించాలని తంగళ్లపల్లి మండలంలోని జిల్లెళ్ల, నేరెళ్ల, చిన్న లింగాపూర్, రామచంద్రపురం, దాచారం రైతులు కోరిన విషయం తెలిసిందే. స్పందించిన కేటీఆర్ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడి నీళ్లు అందివ్వాలని సూచించారు. దీంతో సోమవారం జక్కాపూర్‌లోని రంగనాయక సాగర్ కాల్వను ఎస్‌ఈ రవీందర్, అధికారులు తంగళ్లపల్లి మండలంలో రైతులుతో కలిసి సందర్శించారు. కాలువను పరిశీలించి నీటి సరఫరా చేస్తామని, నీటి ఫ్లో కూడా పెంచుతామని పేర్కొన్నారు. రంగనాయక సాగర్ కాల్వ నుంచి జిల్లెళ్ల వరకు నీటి సరఫరా చేస్తామని, కాలువలో భూములు కోల్పోయిన రైతులకు, పెండింగ్‌లో ఉన్న భూ పరిహారం రూ.55 లక్షలు రైతులకు త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రంగనాయక సార్ కాలువ ద్వారా అందరికీ సమానంగా నీటి సరఫరా చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు తంగళ్లపల్లి మండలంలోని రైతులు కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో మాజీ సర్పంచ్ మాట్ల మధు, మాజీ సింగిల్ విండో చైర్మన్ విజయేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రాజేశ్వరరావు ఉన్నారు.

# కార్పొరేట్లకు ఊడిగం మానాలి

- వ్యవసాయరంగం బలోపేతం ముఖ్యం
- ప్రజల కోణంలో నిర్ణయాలు తీసుకోవాలి

**న్యూఢిల్లీ, మార్చి 3 :** ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేస్తున్న విధానాల కారణంగా, పాలకులక తప్పులకు బాధ్యులు ఎవరన్నది చెప్పాలి. కార్పొరేట్ల కొమ్ము కాస్తే అది ప్రజలకు భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. అందుకే ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వ్యవసాయరంగంలో మనం ముందున్నాం. ప్రపంచానికి అన్నం పెట్టే స్థాయి మనది. అది మరచి విదేశీ పెట్టుబడుల కోసం దేబిరించడం సరికాదు. కార్పొరేట్లకు చేసే మేలు వల్ల సామాజిక బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడలేరు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది. 1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ బాధ్యత నుంచి పక్కకు తప్పు కోవటం, ప్రజలకు కావలసిన ప్రతి అవసరాన్ని సరుకుగా చూడడం మొదలు పెట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32 సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా మారిపోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసిందంటే పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో వుండగా.... భారతదేశ ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది. అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణల పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు రంగానికి కేటాయింపులు చేసేలా ఒత్తిడి తెచ్చింది. దాని ఫలితంగానే నేడు మనకు సర్వదరిద్రాలు వచ్చాయి. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీలపై కోతను విధిస్తోంది. ధరలు పెంచు తోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వరంగ సంస్థలుగా ఉన్న అన్నీ... ప్రైవేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెబుతోంది. దీనివల్ల భవిష్యత్తు లో యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్ మెంట్‌కు కూడా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్న తీరు ప్రజలకు భారంగా మారుతోంది.

# లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. స్వాతి రెడ్డి**




**సిద్దిపేట 3 మార్చ్ 2025:** కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో ఉచితంగా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్. స్వాతి రెడ్డి పిలుపునిచ్చారు.

ఈనెల 8వ తేదీన జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కోర్టులోని తన ఛాంబర్ లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ ద్వారా అవసరమైన వారికి ఉచిత న్యాయ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 8వ తేదీన శనివారం దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. దానిలో భాగంగా సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది అని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కృతంగా ఉన్న సివిల్ మరియు క్రిమినల్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ చక్కని మార్గం చూపిస్తుందని అన్నారు. ఈ లోక్ అదాలత్ ద్వారా భార్యాభర్తల విడాకుల కేసును మినహాయించి మిగతా ప్రతి ఒక్క సివిల్ కేసును రాజీ చేసుకోవడానికి వీలుంటుంది అలాగే నిర్దేశించిన కొన్ని క్రిమినల్ కేసులను కూడా రాజి ద్వారా పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం నిర్వహించిన లోక్ అదాలత్ లో 5505 కేసులను మొత్తం 25 వేల కేసులను పరిష్కరించడం జరిగింద, లోక్ అదాలత్ లో పరిష్కారమైన కేసులకు పూర్తి చట్టబద్ధత ఉంటుందని అన్నారు. ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్ లో కక్షిదారులు అధికంగా పాల్గొని రాజి మార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

# టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

**రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య,ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య పిలుపు**



**హన్మకొండ,మార్చి 03:** రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య అన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపై బలమైన పోరాటాలు నిర్వహించేందుకు ఫెడరేషన్ ను బలోపేతం చేయాలని అన్నారు. సోమవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోనిలో ఆ జిల్లా కమిటీ చేపట్టిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు టి.వి.రాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు బొక్క దయాసాగర్ వల్లాల జగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఫెడరేషన్ నాయకత్వం మరింత బలోపేతం కావాలని సూచించారు. జర్నలిస్టుల పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, హక్కులు హరింపబడుతున్నాయని, పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని, జీవో 239 సమీక్ష పేరుతో కమిటీ వేసి కాలయాపన చేస్తుందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాపితంగా ఫెడరేషన్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, జర్నలిస్టులంతా సభ్యులుగా చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ను మరింత బలోపేతం చేయాలని కోరారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం దేశంలో మరే ప్రభుత్వం చేయలేదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, రాబోయే రోజుల్లో సమస్యలపై ఫెడరేషన్ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు కొలుపుల వివేకానంద, , జిల్లా కార్యదర్శిపి,గోపాల్, నాయకులు ఐలయ్య, రాజేందర్, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు

కరీంనగర్ ,జనతా న్యూస్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ భారీ విజయం సొంతం చేసుకుంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మల్క కొమురయ్య ఘన విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓటు లోనే కొమురయ్య విజయం సాధించడం విశేషం.

బిజెపి అభ్యర్థి మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 12,959 ఓట్లు రావడంతో విజేతగా ప్రకటించారు. పి ఆర్ టి యు అభ్యర్థి వంగా మహేందర్ రెడ్డి కి 7,182 ఓట్లు వచ్చాయి. సోమవారం ఉదయం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ బండిల్లుగా విభజించి ఇన్ వ్యాలీడ్ ఓట్లను తొలగించిన అనంతరం 14 టేబుల్ ల పైకి బ్యాలెట్ పేపర్లను చేర్చి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 27,888 మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉండగా 25,032 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ లో భాగంగా 871 ఓట్లను చెల్లని ఓట్లుగా అధికారులు పక్కన పెట్టారు. అనంతరం 14 టేబుల్ల ద్వారా మొదటి రౌండ్లో 14 వేల మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. మొదటి రౌండ్లో మల్క కొమురయ్యకు 7,601 ఓట్లు రాగా మహేందర్ రెడ్డి కి 4,024 వచ్చాయి. రెండవ రౌండ్ లో కొమురయ్యకు 5,358 ఓట్లు రాగా మహేందర్ రెడ్డి కి 3,158 ఓట్లు వచ్చాయి. మొత్తం చెల్లిన మొదటి ప్రాధాన్యత ఓట్లలో కొమురయ్యకు 12, 959 ఓట్లు సాధించడంతో విజయం సాధించారు. మల్కా కొమురయ్య గెలుపొందడంతో బిజెపి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ప్రాథమిక ఓట్ల లెక్కింపు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లు, చెల్లిన ఓట్ల విభజన ప్రక్రియ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఇంకా కొనసాగుతూనే ఉంది.గ్రాడ్యుయేట్ బ్యాలెట్ బాక్సులు 499, వీటిని లెక్కించే టేబుళ్లు 21 టీచర్స్ బ్యాలెట్ బాక్సులు 274, వీటిని లెక్కించేందుకు 14 టేబుళ్ళు ఏర్పటు చేశారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లకు సంబంధించి సుమారు రెండు లక్షల 50 వేల ఓట్లు పోలయ్యాయి.ఇప్పటివరకు లక్ష ఓట్లను చెల్లని ఓట్లు, చెల్లిన ఓట్లుగా విభజించారు.

ఈ లక్ష ఓట్లలో సుమారు 92,000 ఓట్లు చెల్లుబాటు అయినవి.సుమారు 8000 ఓట్లు చెల్లుబాటు కాలేదు.ఇంకా సుమారు 1,50,000 ఓట్ల విభజనకొనసాగుతోంది












# రహదారి కబ్జాకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోండి..

**మున్సిపల్ కమిషనర్ కు బిజెపి నేత మాసం గణేష్ ఫిర్యాదు...**



కరీంనగర్,జనతా న్యూస్: కరీంనగర్ పట్టణం కోతిరాంపూర్ 9వ డివిజన్ పరిధిలోగల పాండురంగ పంక్షన్ హాల్ గల్లీ నుండి బైపాస్ కు వెళ్లే రహదారిని నేడు కొంద రు కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని సోమవారం రోజున బిజెపి నాయకులు , కాంటెస్టెడ్ కార్పొరేటర్ మాసం గణేష్ మున్సిపల్ కమిషనర్ కు లిఖితపూ ర్వకంగా ఫిర్యాదు చేశారు. 20 ఏళ్లుగా ఆ ప్రాంతం మీదుగా రాకపోకలు కొనసాగించే ప్రజలను నేడు ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్ని స్తున్నారనీ, . ప్రస్తుతం ఇక్కడి రహదా రి స్థలం తమదేనంటూ కొందరు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని , ఈ విషయంపై లోగడ నేను అధికారులకు ఫిర్యాదు చేసి, సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టినందుకు నన్ను కూడా బెదిరించే ప్రయత్నం చేశారని మాసం గణేష్ ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఇక్కడి రహదారి ని తాజా మాజీ ప్రజా ప్రతినిధి అందదండలతో కబ్జా చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారనీ, . పాండురంగ ఫంక్షన్ హాల్ నుండి బైపాస్ కి వెళ్లే రహదారిని కబ్జా కు గురి కాకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో తక్షణం తగిన చర్యలు తీసుకొని, స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని, రహదారి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు కోవాలని ఆయన డివిజన్ ప్రజల పక్షాన విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖ అధికారులను పిలిచి వెంటనే విషయాన్ని పరిశీలించాలని సూచించారు.

# వి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో అలరించిన ఫుడ్ ఫెస్టివల్




**హుజురాబాద్, మార్చి 3 జనతా న్యూస్:** హుజురాబాద్ మండలం సింగపురంలోని వి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ అందరిని అలరించింది. విద్యార్థులే స్వయంగా ఘుమఘుమలాడే రుచికరమైన వివిధ రకాల వంటలను వండి వడ్డించారు. పలు రకాల సాంప్రదాయ వంటకాలు ఆకట్టుకున్నాయి. వి ఎస్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి. ఎన్ హనుమకుమార్ మాట్లాడుతూ.. ఆహారానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, మానవుల మనుగడకు ఆహారం ముఖ్యమని అన్నారు. ఆహారాన్ని వృధా చేయవద్దని,మంచి ఆహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుందని అన్నారు. అందరికీ మంచి పోషకాహారం అందినప్పుడే ఆ దేశం అభివృద్ధి చెందిన జాబితాలో చేరుతుందని అన్నారు. మంచి ఆహారం ద్వారా రోగాలు దూరం అవుతాయని అన్నారు,ఆహారంలో అన్ని రకాల ప్రోటీన్లు తీసుకోవాలని సూచించారు,ఎలాంటి ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ లేకుండా సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న ఆర్గానిక్ పంటలకు ప్రస్తుతం ఎంత ప్రాధాన్యత పెరిగిందని అన్నారు. మన దేశం అభివృద్ధి బాటలో ఉన్నప్పటికీ.. ఇప్పటికీ నిరుపేద వర్గాలకు ఆహారం అందరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పోషకాహారానికి, సిరిధాన్యాలకు పూర్వవైభవం వచ్చిందని అన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ కోర్టు ఆదేశాలపై బాంబే హైకోర్టుకు సెబీ మాజీ చీఫ్



**ముంబయి :** అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలపై సెబీ మాజీ చీఫ్ మాధవి పురీ బచ్.. బాంబే హైకోర్టును ఆశ్రయించారు. బచ్‌తో పాటు బీఎస్ఈ ఎండీ, సీఈఓ సుందరరామన్ రామమూర్తి, పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్, సెబీ పూర్తికాల సభ్యులు అశ్వనీ భాటియా, అనంత్ నారాయణ్, కమలేశ్ చంద్ర వర్ష్నేలపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఏసీబీ కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆ ఆదేశాలను కొట్టి వేయాలంటూ వారు అత్యవసర విచారణను కోరారు. దీనిపై జస్టిస్ ఎస్‌జీ డిగే నేతృత్వంలోని సింగిల్ బెంచ్ మంగళవారం విచారణ జరపనుంది. అప్పటి వరకు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు అమలుచేయొద్దని ఆదేశించారు. సెబీ మాజీ చీఫ్, సెబీ డైరెక్టర్లైన అశ్వినీ భాటియా, అనంత్ నారాయణ జి, కమలేశ్ చంద్ర వర్ష్నే తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. బీఎస్ఈ ఎండీ, సీఈఓ సుందరరామన్‌మూర్తి, మాజీ ఛైర్మన్ పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్ తరఫున సీనియర్ న్యాయవాది అమిత్ దేశాయ్ హాజరయ్యారు. స్టాక్ మార్కెట్‌లో అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మాజీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌తో పాటు అయిదుగురు ఉన్నతాధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ముంబయిలోని ప్రత్యేక ఏసీబీ న్యాయస్థానం న్యాయమూర్తి ఏక్‌నాథ్‌రావు బంగర్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయా అంశాల్లో నియంత్రణాపరమైన లోపాలు చోటుచేసుకున్నాయని, కుట్ర జరిగిందనేందుకు ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నందున.. పారదర్శక, నిష్పాక్షిక విచారణ అవసరమని భావిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. 1994లో బీఎస్ఈలో 'కాల్స్ రిఫైనరీస్ లిమిటెడ్' కంపెనీ షేరు నమోదుకు అనుమతులు ఇవ్వడంలో, పెద్దఎత్తున ఆర్థిక మోసం, నియంత్రణ నిబంధనల ఉల్లంఘన, అవినీతి జరిగిందని ఆరోపిస్తూ థానేకు చెందిన విలేకరి సపన్ శ్రీవాస్తవ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు న్యాయమూర్తి బంగర్ తాజా ఉత్తర్వులు జారీ చేశారు.

## పోలీసులు ఇప్పుడైనా వాక్ స్వాతంత్ర్యాన్ని అర్థం చేసుకోవాలి : సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ :** భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అయ్యిందని, పోలీసులు కనీసం ఇప్పుడైనా వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. రెచ్చగొట్టే పాటను షేర్ చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ విధంగా స్పందించింది. ఈ కేసు తీర్పును రిజర్వ్ చేసింది. గుజరాత్ జామ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ సామూహిక వివాహాల కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ పాల్గొన్నారు. అనంతరం ఓ పద్యంతో కూడిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో షేర్ చేయడం వివాదాస్పదమైంది. ఆ పాట ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని పేర్కొంటూ జనవరి 3న ఎంపీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎంపీ తొలుత గుజరాత్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ.. అక్కడ ఆయనకు ఊరట లభించలేదు. దీంతో ప్రతాప్‌గఢీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) కింద భావప్రకటనా స్వేచ్ఛ, ప్రాథమిక హక్కు పరిరక్షణ ప్రాముఖ్యతను మరోసారి వివరించింది. అది కేవలం పద్యం మాత్రమేనని, అనువాదంలో కొంత సమస్య ఏర్పడి ఉండవచ్చని అభిప్రాయపడింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు పోలీసులు కొంత సున్నితత్వాన్ని ప్రదర్శించాలని పేర్కొంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75ఏళ్లు అవుతుండగా.. కనీసం ఇప్పటికైనా భావప్రకటనా స్వేచ్ఛ గురించి పోలీసులు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది.



## మీరు మాట్లాడేది మనుషుల గురించేనా..?

### పని గంటలపై అఖిలేశ్ యాదవ్ కీలక వ్యాఖ్యలు

**లక్నో :** ఉద్యోగుల పనిగంటల పై దిగ్గజ పారిశ్రామికవేత్తలు తమ అభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై తాజాగా ఎస్పీ అధినేత, యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ స్పందించారు. "ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని సలహా ఇస్తున్నవారు.. మనుషుల గురించి కాకుండా రోబోల గురించి మాట్లాడటం లేదుకదా. ఎందుకంటే, మనుషులైతే.. భావోద్వేగాలతో మెలగాలని, కుటుంబంతో కలిసి జీవించాలని అనుకుంటారు. ఎవరో కొద్దిమందికి కాకుండా దేశప్రజలందరికీ లబ్ధి చేకూర్చేదే నిజమైన ఆర్థిక పురోగతి. పనిలో నాణ్యత ముఖ్యం. ఉన్నతహోదాలో కూర్చున్న వ్యక్తులు.. యువత చేసే హార్డ్‌వర్క్ నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందుతున్నారన్నది నిజం. అందుకే వారానికి 90 గంటలు పనిచేయాలంటూ ఆచరణకు వీలుకాని సలహాలు ఇస్తుంటారు. ఆర్థిక పురోగతి వల్ల కొందరికే లాభం కలిగితే.. ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్లు లేక 100 ట్రిలియన్లకు చేరడం వల్ల సామాన్యుల జీవితాల్లో వచ్చే తేడా ఏముంటుంది..? ఆర్థిక ప్రయోజనాలు అందరికీ అందడమే నిజమైన ఆర్థిక న్యాయం. ఈ ప్రభుత్వ హయాంలో అది సాధ్యంకాదు" అని ఎక్స్ వేదికగా భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ చేరాలంటే దేశ యువత వారానికి 70 గంటల చొప్పున పని చేయాలంటూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలని, ఇంట్లో కూర్చొని ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. తాజాగా నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ వారానికి 80 లేక 90 గంటలైనా సరే భారతీయులు కష్టపడి పనిచేయాలన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ నాలుగు ట్రిలియన్ల నుంచి 30 ట్రిలియన్లకు మారాలంటే.. వినోదమో, సినీ తారల అభిప్రాయాలను అనుసరించడం వలనో సాధ్యంకాదని పేర్కొన్నారు. కష్టపడి పనిచేయకపోవడం గురించి మాట్లాడటం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యలు చేశారు.

# టారిఫ్‌ల ఆందోళన వేళ

## గోయల్ ఆకస్మిక అమెరికా పర్యటన



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై పరస్పర సుంకాలు విధిస్తామని ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం తన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకొని ఆకస్మికంగా అమెరికాకు బయలుదేరారు. మే 8 వరకు ఆయన అక్కడే ఉండి యూఎస్ అధికారులతో అత్యవసర వాణిజ్య చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఆయన ఆకస్మిక అమెరికా పర్యటనపై పూర్తి వివరాలను కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ వెల్లడించలేదు. ప్రతిపాదిత సుంకాల గురించి అగ్రదేశాన్ని స్పష్టత కోరడం, వాటివల్ల దేశంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడం వంటి విషయాలతో సహా సుంకాల తగ్గింపు, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన వాణిజ్య ఒప్పందంపై చర్చలు వంటి వాటిపై కేంద్రమంత్రి దృష్టిపెట్టినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. "భారత్ ఆటోమొబైల్స్, రసాయనాలు వంటి పారిశ్రామిక వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అగ్రదేశంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉంది. అయితే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని అమెరికా చేస్తున్న ఒత్తిడికి ఏమాత్రం లొంగేందుకు సిద్ధంగా లేదు. ఎందుకంటే వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గిస్తే దేశంలోని రైతులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి" అని అధికారిక వర్గాలు వెల్లడించాయి. కాగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత్ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. హై-ఎండ్ మోటార్ సైకిళ్లపై సుంకాలు 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించింది. బోర్బన్ విస్కీ టారిఫ్‌లను 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇతర టారిఫ్‌లను సమీక్షిస్తామని, ఇంధన దిగుమతులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. అమెరికా నుంచి మరిన్ని రక్షణ పరికరాలు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. అమెరికా భారత్‌పై విధించే పరస్పర టారిఫ్‌ల వల్ల భారతదేశానికి సంవత్సరానికి 7 బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక సైతం వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా ఇరు దేశాధినేతలు దౌత్య, వాణిజ్య, రక్షణ సంబంధాలపై చర్చలు జరిపారు. ఈనేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ.. టారిఫ్‌ల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని ప్రధాని నరేంద్రమోదీతో స్వయంగా చెప్పినట్లు పేర్కొన్నారు. అమెరికా నుంచి చేసుకొనే దిగుమతులపై భారత్ అత్యధిక పన్నులు వేస్తోందని, ఇకపై తామూ అదేరీతిలో వ్యవహరిస్తామని తేల్చిచెప్పారు.

## రష్యాకు వ్యతిరేకంగా సైబర్ సమరం ఆపండి

### అమెరికా రక్షణశాఖ ఆదేశాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి రష్యాకు అనుకూల వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రష్యాకు వ్యతిరేకంగా చేపడుతోన్న సైబర్ కార్యకలాపాలన్నీ నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈ నిలిపివేత ఎంతకాలం కొనసాగుతుందన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. ఈమేరకు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చీరాగానే.. మూడేళ్లుగా యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్-రష్యా మధ్య మధ్యవర్తిగా ట్రంప్ వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో పుతిన్‌ను పొగుడుతూ, జెలెన్‌స్కీ చర్యలను నిందిస్తూ మధ్యవర్తిత్వాన్ని నెరపుతున్నారు. ఇటీవల ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీతో మీడియా ఎదుటే వాగ్వాదానికి దిగడం యావత్ ప్రపంచాన్ని నివ్వెరపర్చిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో తాజాగా ఓ కథనం వెలువడింది. రష్యా విషయంలో అమెరికా అనుసరిస్తోన్న విధానాలను ట్రంప్ యంత్రాంగం పునఃసమీక్షిస్తోంది. అయితే తాజా రిపోర్ట్‌పై స్పందించేందుకు పెంటగాన్ నిరాకరించింది. సైబర్ ఇంటెలిజెన్స్‌లోని ముఖ్యమైన సమాచారాన్ని తాము బహిరంగంగా పంచుకోలేమని తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్ష కార్యాలయంలోకి అడుగుపెట్టిన ఐదు వారాల్లోనే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. రష్యా అధినేత పుతిన్‌తో ఫిబ్రవరి 12న ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత 18వ తేదీన సౌదీ అరేబియాలో అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలు, మంత్రులు భేటీ అయ్యారు. సంబంధాలను మెరుగుపర్చుకొనేందుకు రెండు దేశాలు ముందుకు అడుగులు వేస్తున్నాయి. ఈక్రమంలో సౌదీ తర్వాత తుర్కియేలోని అమెరికా రాయబార కార్యాలయం అందుకు వేదికైంది. వాషింగ్టన్, మాస్కోలోని దౌత్య కార్యాలయాల్లో ఉన్న వివాదాలను ఈసందర్భంగా చర్చించుకొన్నారు. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటినుంచి ఆంక్షలతో రెండు దేశాల మధ్య నిలిచిపోయిన విమాన సర్వీసులను పునరుద్ధరించాలని రష్యా ప్రతిపాదించింది. మునుపటి అమెరికా పాలకుల మూసశైలితో పోలిస్తే ట్రంప్ ఆయా అంశాలపై చూపిస్తున్న వాస్తవిక ధోరణి బాగుందని పుతిన్ ఈ సందర్భంగా కొనియాడారు. కొత్త యంత్రాంగంతో చర్చలు సరికొత్త ఆశల్ని రేకెత్తిస్తున్నాయన్నారు. సంబంధాలు పునరుద్ధరించుకొని, క్రమక్రమంగా సమస్యల్ని పరిష్కరించుకుంటామని ఆశాభావం వ్యక్తంచేశారు.

## యూఏఈలో భారత మహిళకు మరణశిక్ష అమలు

**యూఏఈ :** యూఏఈలో భారత మహిళ షెహజాది ఖాన్‌కు మరణశిక్ష అమలైంది. తన సంరక్షణలో ఉన్న చిన్నారి మృతి కేసులో హత్య అభియోగాలు నమోదుకావడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాందా జిల్లాకు చెందిన ఆమెకు యూఏఈ ప్రభుత్వం మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. తమ కుమార్తెను రక్షించాలంటూ కుటుంబం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో చివరకు ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఫిబ్రవరి 15నే ఈ శిక్ష అమలైంది. ఈ విషయాన్ని దిల్లీ హైకోర్టుకు విదేశాంగ శాఖ తెలియజేసింది. యూపీలోని బాందా జిల్లా గోయ్రా ముగ్లి గ్రామానికి చెందిన షెహజాది 2020లో కిచెన్‌లో పనిచేస్తుండగా అగ్నిప్రమాదానికి గురైంది. అనంతరం ఆసుపత్రిలో చికిత్సతో కోలుకుంది. 2021లో ఉజైర్ అనే వ్యక్తి ఆమెను యూఏఈలోని అబుదాబీకి తీసుకెళతానని.. అక్కడ జీవితం బాగుంటుందని ఆశపెట్టాడు. ఆ మాటలు నమ్మి అతడితో వెళ్లింది. ఉజైర్ ఆమెను ఆగ్రాలోని తమ బంధువులైన ఫైజ్, నాడియా దంపతులకు విక్రయించాడు. వారు ఆమెను అబుదాబీకి తీసుకెళ్లారు. చివరికి ఈ వ్యవహారం కోర్టుకు చేరడంతో.. న్యాయస్థానం ఆదేశాలతో ఫైజ్-నాడియా దంపతులపై మానవ అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. తాజాగా ఫిబ్రవరి 16వ తేదీన అక్కడి జైలు అధికారులు షెహజాది చివరి కోరిక ఏమిటని అడగ్గా.. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడతానని అభ్యర్థించింది. దీంతో యూపీలోని ఆమె కుటుంబ సభ్యులతో వారు మాట్లాడించారు. ఈ సందర్భంగా తాను నిర్దోషినని ఆమె కుటుంబం వద్ద కన్నీటి పర్యంతమైంది. తాజాగా ఆమెకు మరణశిక్ష అమలైంది.

## ఉత్తర, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో కార్చిచ్చు

### అత్యవసర పరిస్థితి విధింపు



**కరోలినా :** అమెరికాలోని ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా రాష్ట్రాల్లో కార్చిచ్చు వ్యాపించింది. ఇప్పటికే వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది దానిని ఆర్పేందుకు తీవ్ర స్థాయిలో యత్నిస్తున్నారు. దక్షిణ కరోలినా రాష్ట్ర అటవీ సంరక్షణ విభాగం ప్రకారం.. ఇప్పటికే 4.9 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ భూమి దగ్ధమైపోయింది. ఇప్పటి వరకు ఈ కార్చిచ్చులో ఎవరు గాయపడినట్లు, ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం లేదు. సౌత్ కరోలినాలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర గవర్నర్ హెన్రీ మెక్‌మాస్టర్ ప్రకటించారు. ఇక పరిస్థితిని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది యత్నిస్తునట్లు వెల్లడించారు. మొత్తం 175 ప్రదేశాల్లో మంటలు వ్యాపించాయని వెల్లడించారు. నార్త్ కరోలినాలో నాలుగు వేర్వేరు అటవీప్రాంతాల్లో రేగిన కార్చిచ్చుతో 161 హెక్టార్లు దగ్ధమయ్యాయి. వీటిల్లో ఉవారీ నేషనల్ ఫారెస్ట్‌లో చెలరేగిన మంటలు అతిపెద్దవని అధికారులు చెబుతున్నారు.

### జపాన్‌లో 30 ఏళ్లలో అతిపెద్ద కార్చిచ్చు..

జపాన్‌లో గత 30 ఏళ్లలో ఎన్నడూ చూడనంత అతిపెద్ద కార్చిచ్చు వ్యాపించింది. దీంతో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటి వరకు 4,500 ఎకరాల్లో అటవీ సంపద కాలి బూడిదయ్యింది. ఈ మంటలు అసలు ఇప్పట్లో శాంతించేలా లేవని అధికారులు చెబుతున్నారు. ఆ దేశ ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ అంచనాల ప్రకారం ఈ కార్చిచ్చును తొలుత బుధవారం గుర్తించారు. నాడు కనీసం 84 ఇళ్లను ఇది కాల్చేసింది. అదే సమయంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆదివారం ఉదయం దాదాపు 4,600 మందిని ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. 1,200 ఇళ్లలోని వారిని అత్యవసర వసతి ప్రదేశాలకు తరలించారు. దాదాపు 1,700 మంది సిబ్బంది మంటలను ఆర్పేందుకు తరలించారు. సహాయక చర్యల కోసం విమానాలను కూడా రంగంలోకి దించారు. 1992లో హొక్కైడో వచ్చిన కార్చిచ్చుతో పోలిస్తే ఇది చాలా పెద్దది. నాడు అది 1,000 హెక్టార్ల అటవీ భూమిని దగ్ధం చేసింది.

## ఐటీ రూల్స్‌పై పిల్.. కేంద్రానికి సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ :** ఐటీ నిబంధనలను(2009) సవాలు చేస్తూ దాఖలైన ఓ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై ఆరు వారాల్లోగా స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు పంపింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నుంచి సమాచారాన్ని తొలగించడానికి ముందు వాటిని రూపొందించిన కంటెంట్ క్రియేటర్లకు నోటీసు ఇవ్వాలని సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్ అనే సంస్థ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ వాదనలు వినిపిస్తూ.. సామాజిక మాధ్యమాల నుంచి సమాచారాన్ని తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ ఆ పోస్టు చేసిన వ్యక్తికి నోటీసులివ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అలా చేయకపోవడం సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘించడమేనని ఆమె వాదించారు.

దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ.. ప్రముఖ వ్యక్తులు ఎవరైనా సోషల్ మీడియాల్లో ఏదైనా సమాచారాన్ని పోస్ట్ చేస్తే.. దానిని తొలగించే ముందు వారికి నోటీసులు జారీ చేసి.. వాదనలు వినాల్సిందిగా భావిస్తున్నట్లు వెల్లడించింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ.. ఆరు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

## 'అర్జెంట్‌గా పిల్లల్ని కనండి'


### తమిళ ప్రజలకు సీఎం స్టాలిన్ విజ్ఞప్తి



**చెన్నై:** లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గత కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే.. రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై తాజాగా మరోసారి స్పందించిన స్టాలిన్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పునర్విభజనతో నష్టం జరగకుండా ఉండాలంటే కొత్తగా పెళ్లయిన జంటలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని కోరారు. నాగపట్నంలోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "నవ దంపతులు సంతానం విషయంలో కొంత సమయం తీసుకోవాలని గతంలో నేనే చెప్పా. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి. నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోన్న వేళ ఇప్పుడలా చెప్పలేను. అంతకుముందు మేం కుటుంబనియంత్రణపై దృష్టిసారించాం. కానీ ఇప్పుడు జనాభా పెంచుకోక తప్పని పరిస్థితుల్లోకి నెట్టివేయబడ్డాం. అందుకే నేను కోరుకునేది ఒక్కటే. కొత్తగా పెళ్లయిన దంపతులు త్వరగా పిల్లలను కనండి. వారికి మంచి తమిళ్ పేర్లు పెట్టండి" అని సీఎం రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొళత్తూర్‌లోని ఓ వివాహ వేడుకలోనూ స్టాలిన్ ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. "పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టాం. కానీ, దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఈ అంశంపై చర్చించేందుకు ఈనెల 5న సీఎం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనాలంటూ ఎన్నికల సంఘం గుర్తింపుపొందిన రాష్ట్రంలోని 40కు పైగా పార్టీలకు ఆహ్వానం పంపారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పనులను కేంద్రప్రభుత్వం 2026లో చేపట్టనున్న నేపథ్యంలో జనాభా ఆధారంగా ఇది జరిగితే రాష్ట్రానికి 8 నియోజకవర్గాల వరకు తగ్గుతాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అసభ్య పదజాలం 'టాలెంట్' కాదు

### అల్హాబాదియాకు సుప్రీంలో ఊరట



**న్యూఢిల్లీ :** 'ఇండియాస్ గాట్ లాటెంట్' వేదికగా యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశమంతటా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో అల్హాబాదియాకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. పాడ్‌కాస్ట్‌ను రద్దు చేయాలన్న ప్రాసిక్యూషన్ వాదనను తిరస్కరించిన న్యాయస్థానం.. దానిని తిరిగి పునఃప్రారంభించేందుకు యూట్యూబర్‌కు అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా అల్హాబాదియాకు న్యాయస్థానం మరోసారి చురకలు అంటించింది. భావప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఉన్నాయని, అసభ్య పదజాలం వాడటం హాస్యం కాదని మందలించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అరెస్టు నుంచి రక్షణను పొడిగించిన ధర్మాసనం.. గువహాటిలో నమోదైన కేసులో దర్యాప్తునకు హాజరు కావాలని ఆదేశించింది. నైతికత, భావప్రకటనా స్వేచ్ఛను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. డిజిటల్ కంటెంట్‌పై మార్గదర్శకాలు రూపొందించేటప్పుడు ఈ అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

## నెల రోజుల శిశువుకు 40 వాతలు



**భువనేశ్వర్:** ఒడిశాలోని నవరంగాపూర్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. చికిత్స పేరుతో అనారోగ్యంతో బాధపడుతున్న నెల రోజుల శిశువుకు కుటుంబ సభ్యులు ఇనుప కడ్డీని కాల్చి శరీరంపై 40 వాతలు పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సిబ్బంది చిన్నారిని వెంటనే దగ్గరలోకి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. గంభరిగూడ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఈ ఘటన వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కుటుంబంలోని నెల రోజుల వయసున్న ఓ చిన్నారి వారం రోజులుగా తీవ్ర జ్వరం, జలుబుతో బాధపడుతోంది. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో కుటుంబసభ్యులు పసివాడికి గాలి సోకిందని భావించారు. వైద్యం అందించడానికి బదులు మూఢనమ్మకాలకు ప్రభావితమై.. ఇనుప కడ్డీని కాల్చి దానితో శిశువు శరీరంపై 40 చోట్ల వాతలు పెట్టారు. అనంతరం చిన్నారి ఆరోగ్యం మరింత క్షీణించడంతో పంచాయతీ సిబ్బంది స్థానిక ఉమర్‌కోట్ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అనారోగ్యం పాలైన వారికి ఈ విధంగా వేడి లోహంతో ముద్ర వేయడం వల్ల శరీరంపై ఉన్న దుష్టశక్తులు పోతాయని అక్కడి వారు నమ్మతారని అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా చిన్నారి తలపై, కడుపుపై 40 వాతలు పెట్టారని అన్నారు. విషయం తెలుసుకున్న నవరంగాపూర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ పండా ఆస్పత్రిని సందర్శించి శిశువు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మారుమూల గ్రామాల ప్రజలు మూఢనమ్మకాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.




## అవి చౌకబారు వ్యాఖ్యలు

### రోహిత్‌పై బాడీషేమింగ్‌పై బీసీసీఐ..

భారత క్రికెట్ హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లావుగా ఉన్నాడంటూ కాంగ్రెస్ నేత శమా మహమ్మద్ చేసిన సోషల్ మీడియా పోస్టు విమర్శలకు దారి తీసింది. తాజాగా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ పెద్దలు కూడా స్పందించారు. కీలక టోర్నీ మధ్యలో ఉన్నప్పుడు ఇటువంటి కామెంట్లు చేసి ఉండాల్సింది కాదన్నారు. తాజాగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. వ్యక్తిగత ప్రచారం కోసమే ఇలాంటివి చేయడం మానుకోవాలన్నారు. “జట్టు ఓ కీలకమైన ఐసీసీ టోర్నీ మధ్యలో ఉంది. ఆ సమయంలో ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి నుంచి ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు రావడం దురదృష్టకరం. అవి వ్యక్తిగతంగా ఆటగాడిపైనా లేదా.. జట్టుపై ప్రతికూల ప్రభావం చూపించి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యక్తిగత ప్రచారం కోసం ఇటువంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి” అని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వద్ద సైకియా అన్నారు. శమా మహమ్మద్ ఎక్స్‌లో పోస్టు ఓ పోస్టు చేశారు. దీనిలో “రోహిత్ శర్మ లావుగా ఉన్నాడు. అతడు బరువు తగ్గాల్సిన అవసరం ఉంది.” అని ఆ పోస్టులో వ్యాఖ్యానించారు. ఇది వెంటనే వైరల్‌గా మారింది. మరోవైపు ఇంత జరిగినా.. శమా మహమ్మద్ మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకొనే యత్నం చేశారు. ఉదయం ఓ ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ “క్రీడాకారుడి ఫిట్‌నెస్ గురించి చెబుతూ చేసిన సాధారణ ట్వీట్ అది. అది బాడీ షేమింగ్ కాదు. ఆటగాళ్లు ఫిట్‌గా ఉండాలని నేను నమ్ముతాను. అతడు కొంచెం ఓవర్ వెయిట్ ఉన్నాడని భావించాను. దాని గురించే పోస్టు చేశాను. నాపై ఆకారణంగా విమర్శల దాడులు చేస్తున్నారు. నేను అతడిని గత కెప్టెన్లతో పోలుస్తూ రాసుకొచ్చాను. నాకు ఆ హక్కు ఉంది. చెప్పడంలో తప్పేముంది. ఇది ప్రజాస్వామ్యం” అని సమర్థించుకొన్నారు. ఈ పోస్టు కాంగ్రెస్–భాజపా మధ్య రాజకీయ విమర్శలకు దారితీసింది. దీంతో హస్తం పార్టీ శమా వ్యాఖ్యలకు దూరంగా జరిగింది. తమకు వాటితో సంబంధం లేదని పేర్కొంది. ఆ పోస్టును తొలగించమని ఆదేశించింది.

## సెమీస్ నుంచే అసలు టోర్నీ మొదలు : జంపా



సెమీఫైనల్స్ నుంచే అసలైన ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్ మొదలవుతుందని ఆసీస్ స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా పేర్కొన్నాడు. అతడు దుబాయ్‌లోని ఓ ఆస్ట్రేలియా పత్రికతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. స్థానిక ఐసీసీ అకాడమీలో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని మెచ్చుకొన్నాడు. “పాక్‌లో వరుసగా వేర్వేరు సిటీల్లో మ్యాచ్‌లతో బిజీగా గడిపాము. కానీ టోర్నమెంట్ స్వభావం ప్రకారం ఎక్కడ తొలి సెమీస్ జరుగుతుందో చివరివరకు తెలియలేదు. ఇక్కడికి (దుబాయ్) రావడం బాగుంది. మంచి సౌకర్యాలు లభించాయి. ఈ టోర్నీలో ఎక్కువ ఆడే అవకాశం రాకపోయినా.. ప్రిపరేషన్ బాగానే జరిగింది. ప్రతి మ్యాచ్ కీలకమైందే. ఇక ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారీ స్కోర్ ఛేజ్ చేయడంతో మిగిలిన టోర్నీకి మమ్మల్ని సిద్ధం చేసింది. ఇక అఫ్గానిస్థాన్‌పై బౌలింగ్ కూడా బాగుంది. కానీ, అసలైన టోర్నమెంట్ సెమీఫైనల్స్ నుంచే మొదలవుతుంది. ప్రతీ మ్యాచ్ గెలిచి తీరాల్సిందే” అని జంపా వెల్లడించాడు.

# రహానేకు కోల్‌కతా పగ్గాలు

### వైస్ కెప్టెన్‌గా అయ్యర్



మరో 18 రోజుల్లో ఐపీఎల్ 18వ ఎడిషన్ టోర్నీ ప్రారంభం కానుంది. ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన రెండు వారాల్లోపే క్రికెట్ అభిమానులను సందడి చేయనుంది. ఈ కొత్త సీజన్‌కు కొత్త జెర్సీతో సిద్ధమవుతున్న డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ తాజాగా కెప్టెన్‌ను కూడా ప్రకటించింది. సీనియర్ క్రికెటర్ అజింక్య రహానేకు జట్టు పగ్గాలు అప్పగించింది. ఇక, యువ ఆటగాడు వెంకటేశ్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలిచ్చింది. ఈ మేరకు ఫ్రాంఛైజీ సోమవారం తమ అధికారిక ‘ఎక్స్’ ఖాతాలో ప్రకటించింది. గత ఐపీఎల్ టైటిల్‌ను అందించిన శ్రేయస్ అయ్యర్‌ను మేనేజ్‌మెంట్ ఈసారి రిటైన్ చేసుకోలేదు. మెగా వేలంలోనూ తీసుకోలేదు. యువ బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్‌కు భారీ మొత్తం వెచ్చించింది. అనూహ్యంగా వెటరన్ ఆటగాడు అజింక్యా రహానెను తీసుకుంది. వీరిద్దరిలోనూ ఒకరికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారని ముందు నుంచీ ప్రచారం జరిగింది. ఆ అంచనాలకు అనుగుణంగానే సీనియర్ వైపు యాజమాన్యం మొగ్గుచూపింది. దీంతో దిల్లీ క్యాపిటల్స్ మినహా మిగతా అన్ని జట్లకు సారథి ఎవరనేది తేలిపోయింది. దిల్లీ మాత్రం కేఎల్ రాహుల్ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరిని కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

**కొత్త జెర్సీతో..** 2025 సీజన్ కోసం జట్టు కొత్త జెర్సీని కోల్‌కతా నేడు ఆవిష్కరించింది. జెర్సీపై మూడు స్టార్లకు చోటు కల్పించింది. ఈమేరకు సోషల్‌మీడియాలో స్పెషల్ వీడియోను కేకేఆర్ పోస్టు చేసింది. “జెర్సీ మీద మేం మూడు స్టార్లకు స్థానం కల్పించాం. కేకేఆర్ మూడు టైటిళ్లను సొంతం చేసుకుంది. మే 27, 2012, జూన్ 1, 2014, మే 26, 2024న మేం విజేతలుగా నిలిచాం. మిథున రాశి రోజునే ఇవన్నీ జరిగాయి. చివరిగా వచ్చిన మూడో స్టార్ మమ్మల్ని మళ్లీ అగ్రస్థానానికి చేర్చింది. ఈసారి కూడా అదే ఉత్సాహం ప్రదర్శిస్తాం. మూడు టైటిళ్లకు కర్బో, లోర్బో, జీత్బో అని నామకరణం చేశాం. బెంగాలీ పదాలైన వీటికి ప్రదర్శన, పోరాటం, గెలుపు అని అర్థం. ఇది కేవలం మా ఉద్దేశం మాత్రమే కాకుండా.. ఛాంపియన్ వారసత్వాన్ని కొనసాగించేందుకు స్ఫూర్తిగా నిలుస్తాయి” అని కేకేఆర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ బిందా దే వెల్లడించారు.

## పాక్‌లో ఆడుంటే..

# భారత్ భారీ స్కోర్లే చేసేది

### ‘దుబాయ్’ పిచ్ అడ్వాంటేజ్‌పై గంగూలీ

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ సెమీస్‌కు చేరుకుంది. దుబాయ్ వేదికగానే టీమ్ఇండియా అన్ని మ్యాచ్‌లనూ ఆడుతోంది. ఇదే కొందరికి నచ్చలేదు. అవాకులు, చెవాకులు పేలుతూ భారత విజయాలను తక్కువ చేసే పనిలో పడ్డారు. అలాంటి వారిలో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు నాజర్ హుస్సేన్, మైక్ అథర్టన్ ముందున్నారు. వారికి భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. “పాకిస్థాన్ పిచ్‌లు కాస్త నయం. ఒకవేళ భారత్ కనుక దుబాయ్‌లో కాకుండా పాక్‌లో ఆడుంటే భారీ స్కోర్లను చేసేది. కొందరు చేస్తున్న వ్యాఖ్యలన్నీ చెత్తవే. అలా ఎందుకు మాట్లాడతారో అర్థం కాదు” అని వ్యాఖ్యానించాడు.

#### భారత్ ఎవరినైనా ఓడించగలదు

“టీమ్ఇండియా గత టీ20 ప్రపంచకప్‌ను నెగ్గింది. అలాగే వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భారత్ బలమైన జట్టే. ప్రత్యర్థి ఎవరైనా సరే.. ఆ జట్టును ఓడించగల సత్తా టీమ్ఇండియా సొంతం. బౌలింగ్ పరంగా జస్‌ప్రీత్ బుమ్రా లేనప్పటికీ షమీ రూపంలో నాణ్యమైన పేసర్ ఉన్నాడు. అయితే, గాయాలు క్రికెట్‌లో సహజమే. మరీ ముఖ్యంగా పేసర్లకు గాయాల బెడద ఎక్కువే. బుమ్రాతో కలిసి షమీ చాలా మ్యాచ్‌లు గెలిపించాడు” అని గంగూలీ తెలిపాడు.



#### మేం అలా చేయలేకపోయాం: హెన్రీ

దుబాయ్ పిచ్ భారత్‌కు అడ్వాంటేజ్ అనే వార్తలపై న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ స్పందించాడు. “ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతుందని మాకు ముందే తెలుసు. వారంతా అద్భుతంగా బౌలింగ్ చేశారు. పరిస్థితిని అర్థం చేసుకోవడంలో వారు సక్సెస్ అయ్యారు. మేం అలా చేయలేకపోయాం. మరీ ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి నాణ్యమైన స్పిన్ బౌలింగ్ వేశాడు. రెండువైపులా బంతిని టర్న్ చేశాడు. భారత్‌కు పిచ్‌పై పూర్తి అవగాహన ఉంది. మెరుగైన బౌలింగ్ ఎటాక్‌ను సిద్ధం చేసుకోవడం భారత్‌కు సాయపడింది” అని హెన్రీ తెలిపాడు.

## అక్షర్ పాదాలను టచ్ చేయబోయిన విరాట్



ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ హ్యాట్రిక్ సాధించింది. కివీస్‌ను చిత్తు చేసి అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. టీమ్ఇండియా నిర్దేశించిన 250 పరుగుల లక్ష్య ఛేదనలో కివీస్ 205 పరుగులకే ఆలౌటైంది. స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (81)ను ఔట్ చేయడంతో భారత్ విజయం ఖరారైంది. ఆ వికెట్‌ను అక్షర్ పటేల్ తీశాడు. ముందుకొచ్చి భారీ షాట్ కొట్టేందుకు ప్రయత్నించిన కేన్ బంతిని మిస్ చేసుకున్నాడు. నేరుగా వికెట్ కీపర్ చేతుల్లో పడటంతో కనీసం కేన్ వెనక్కి కూడా తిరిగిచూడకుండా పెవిలియన్ బాట పట్టాడు. కీపర్ కేఎల్ రాహుల్ స్టంప్స్‌ను పడగొట్టాడు. దీంతో అప్పటివరకు ఆశలు పెట్టుకున్న కివీస్ ఓటమి పాలైంది. ఈ వికెట్ తీసిన అక్షర్ పటేల్‌ను అభినందించే క్రమంలో విరాట్ కోహ్లీ చేసిన విన్యాసం నెట్టింట వైరల్‌గా మారింది. అక్షర్ పాదాలను పట్టుకొనేందుకు విరాట్ ప్రయత్నించడం.. అందుకు అక్షర్ కింద కూర్చోవడం అభిమానులను నవ్వుల్లో ముంచెత్తింది. అంతకుముందు వికెట్ పడినప్పుడు కూడా విరాట్ సంబరాలు విభిన్నంగా చేసుకున్నాడు. ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో స్టైల్‌ను అనుకరించాడు. విరాట్ కోహ్లీకిది 300వ వన్డే మ్యాచ్ కావడం విశేషం. అయితే, ఇన్నింగ్స్‌ను దూకుడుగానే ప్రారంభించినప్పటికీ.. గ్లెన్ ఫిలిప్స్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో కోహ్లీ 11 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు.

### జడేజాపై కివీస్ మాజీ క్రికెటర్ అసహనం

భారత స్పిన్నర్ రవీంద్ర జడేజాపై న్యూజిలాండ్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ సైమన్ డౌల్ అసహనం వ్యక్తంచేశాడు. వికెట్ పడినప్పుడు సంబరాలు చేసుకొనే క్రమంలో రెడ్‌లైన్ మీద అడుగులు వేయడంపై అంపైర్ దృష్టిసారించాలని పేర్కొన్నాడు. ఇన్నింగ్స్‌లో 33వ ఓవర్ వేసిన రవీంద్ర జడేజా అద్భుతమైన బంతికి టామ్ లేథమ్‌ను ఎల్బీ చేశాడు. ఈక్రమంలో అప్పీలు చేసుకుంటూ ఆ ‘హాట్ స్పాట్’పై అడుగులు వేశాడు. దీంతో కామెంట్రీ బాక్స్‌లో ఉన్న డౌల్ స్పందిస్తూ.. “అలా చూడండి. జడేజా బౌలింగ్ వేసే ప్రాంతంపై వెళ్తున్నాడు. అతడికి అంపైర్ వార్నింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంది” అని వ్యాఖ్యానించాడు.


## కోహ్లి నన్ను గుర్తుకు తెస్తున్నాడు

### - వివియన్ రిచర్డ్స్



**ముంబయి:** విరాట్ కోహ్లి పోరాట స్ఫూర్తి, ఉత్సాహం, తపన అతడిని గొప్ప క్రికెటర్లు, దిగ్గజ ఆటగాళ్ల జాబితాలో చేర్చాయని వెస్టిండీస్ మాజీ కెప్టెన్ వివియన్ రిచర్డ్స్ అన్నాడు. కోహ్లి తనను గుర్తుకు తెస్తున్నాడని రిచర్డ్స్ ప్రశంసించాడు. “కోహ్లి అందరికీ సమాధానాలు ఇచ్చాడు. వన్డే ప్రపంచకప్‌కు ముందు కోహ్లి పెద్దగా ఫామ్‌లో లేడు. కానీ ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించాడు. కోహ్లి ప్రతిభకు ఇదే నిదర్శనం. అందుకే అతడిని గొప్ప, దిగ్గజాల జాబితాలో చేర్చాను. కోహ్లి పోరాట స్ఫూర్తి, ఉత్సాహం, బాగా ఆడాలన్న తపన అతడిని ప్రత్యేకంగా నిలబెట్టాయి. మైదానంలో కోహ్లి చురుకుదనం అద్భుతం. మ్యాచ్‌లో ప్రతి సందర్భంలో తన ప్రమేయం ఉందని చూపిస్తాడు. చాలామంది ఆటగాళ్లను ఇష్టపడతా. సచిన్ తెందుల్కర్‌కు ఆరాధించేవాడిని. ఇప్పుడతను రిటైరయ్యాడు. ప్రస్తుతం కోహ్లి అంటే చాలా ఇష్టం. అతను నన్ను గుర్తుకుతెస్తున్నాడు. విజయం కోసం ధైర్యంగా దూసుకెళ్తాడు. తనను తాను నమ్ముకుంటాడు. అన్ని సందర్భాల్లో 120 శాతం ఆత్మవిశ్వాసంతో ఉంటాడు. దూకుడుగా ఉంటూ ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సినప్పుడు అలాంటి ఆటగాళ్లు అవసరం” అని రిచర్డ్స్ పేర్కొన్నాడు.

**అఫ్గాన్‌ను చూసి నేర్చుకోవాలి:** ప్రపంచ క్రికెట్లో వెస్టిండీస్ పూర్వ వైభవం సాధించాలంటే అఫ్గానిస్తాన్ నుంచి కొంతైనా నేర్చుకోవాలని రిచర్డ్స్ అభిప్రాయపడ్డాడు. “అఫ్గాన్ ఆటగాళ్ల నుంచి మా జట్టు విండీస్ కొంతైనా నేర్చుకుంటుందని ఆశిస్తున్నా. ఆట పట్ల వారి తపన, అంకితభావం గొప్పగా అనిపిస్తోంది. ప్రపంచ క్రికెట్లో మిగతా జట్ల మాదిరి అఫ్గాన్ సుదీర్ఘ కాలంగా లేదు. కానీ వాళ్ల పోరాట స్ఫూర్తి అద్భుతం. ప్రతి ఏడాది ఎంతోకొంత నేర్చుకోవడం ద్వారా సంపాదించిన అనుభవంతో అఫ్గాన్ జట్టు ప్రస్తుత స్థాయికి చేరుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో అఫ్గాన్ ఆడుతోంది, విండీస్ ఆడట్లేదు అంటే.. ఆ జట్టు ఏదో సరిగ్గా చేస్తోందని అర్థం” అని రిచర్డ్స్ తెలిపాడు.



## ఓలా ఎలక్ట్రిక్‌లో 1000 ఉద్యోగాల కోత..?

**ముంబయి:** ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునేందుకు సిద్ధమవుతోంది. నష్టాలను పూడ్చుకునేందుకు కాంట్రాక్టు ఉద్యోగులతో కలిపి సుమారు 1,000 మంది వరకు సిబ్బందికి లేఆఫ్ ఇవ్వాలని ప్రణాళికలు వేస్తోందని ‘బ్లూమ్‌బెర్గ్’ తన కథనంలో పేర్కొంది. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పలు విభాగాల్లో ఈ కోత ఉండనున్నట్లు సమాచారం. 5 నెలల వ్యవధిలో ఓలా నుంచి ఇలాంటి వార్తలు రావడం ఇది రెండోసారి. గత నవంబర్‌లో 500 మంది సిబ్బందిని ఓలా ఎలక్ట్రిక్ తొలగించింది. ఇటీవల ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో ఓలా ఎలక్ట్రిక్ రూ.564 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. గతేడాది ఇదే త్రైమాసికంలో ప్రకటించిన రూ.376 కోట్ల నష్టంతో పోలిస్తే నష్టాలు మరింత పెరగడం గమనార్హం. పెరిగిన పోటీ కారణంగా ఆదాయాలు తగ్గుముఖం పట్టడం, సేవా లోపాలను సరిదిద్దేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేయడం వంటివి ఇందుకు కారణమయ్యాయి. అలాగే నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా 800గా ఉన్న స్టోర్ల సంఖ్యను ఓలా ఎలక్ట్రిక్ 4 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. విద్యుత్ వాహన విభాగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌పై ఇటీవల కాలంలో ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విక్రయానంతర సేవల విషయంలో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 10వేలకు పైనే ఫిర్యాదులు రావడం, దీనిపై సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ విచారణకు ఆదేశించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# మరోసారి నష్టాల్లో సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీలు.. స్వల్ప నష్టాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్‌లో అమ్మకాలు సూచీలను పడేశాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, మెటల్, ఆటో, ఫార్మా, రియాలిటీ, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించగా.. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్ల అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 73,427.65 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,198.10) భారీ లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 73,198.10 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 112.16 పాయింట్ల నష్టంతో 73,085.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.40 పాయింట్ల నష్టపోయి 22,119.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 2 పైసలు బలపడి 87.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి.

# ఒక్క ప్రకటనతో రూ.26 లక్షల కోట్లు

### క్రిప్టోమార్కెట్‌లో ట్రంప్ జోష్..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక్క ప్రకటన క్రిప్టో మార్కెట్లోకి 300 బిలియన్ డాలర్ల (సుమారు రూ.26 లక్షల కోట్లు)ను చొప్పించింది. ఆయన ఆదివారం రాత్రి ఐదు క్రిప్టో కరెన్సీలను అమెరికా వ్యూహాత్మక రిజర్వులుగా ఉంచాలనుకొంటున్నట్లు సోషల్‌మీడియా వేదికగా ప్రకటించారు. ఈమేరకు ప్రెసిడెన్షియల్ వర్కింగ్ గ్రూప్ క్రిప్టో వ్యూహాత్మక రిజర్వులు ఏర్పాటుచేసేలా పని చేయాలని మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ రిజర్వుల్లో ఎక్స్‌ఆర్‌పీ, ఎస్‌వోఎల్(సోలాన,), ఏడీఏ (కార్డనో) కరెన్సీలను చేర్చాలన్నారు. ఆ తర్వాత గంటన్నరకు బిట్‌కాయిన్, ఎథర్‌ను కూడా చేర్చాలని పోస్టు పెట్టారు. గతంలో ట్రంప్ క్రిప్టోలపై ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసిన సమయంలో కాయిన్ల పేర్లను ప్రస్తావించలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడి ప్రకటన వెలువడిన వెంటనే ఐదు క్రిప్టో కరెన్సీల విలువ దూసుకెళ్లింది. ఇక వీటిని అమెరికా ఎలా నిల్వలు చేస్తుందనే అంశంపై మాత్రం వివరాలు వెల్లడి కావాల్సిఉంది. ఎక్స్‌ఆర్‌పీ, ఎస్‌వోఎల్, ఏడీఏ విలువ 62శాతం పెరగ్గా.. బిట్‌కాయిన్, ఎథర్ విలువ 10శాతానికి పైగా ఎగసింది. వాస్తవానికి బిట్‌కాయిన్ ఫిబ్రవరి నెలలో కొంత విలువ కోల్పోయింది. ఇప్పుడు మళ్లీ వేగంగా పుంజుకొంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా కూడా ట్రంప్ క్రిప్టోలను బాగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. అప్పటికే అధ్యక్షుడిగా ఉన్న బైడెన్ మాత్రం మనీలాండరింగ్, మోసాల భయంతో వీటిని అణచివేసేందుకు యత్నించారు. ఇక ట్రంప్ విజయం తర్వాత బిట్‌కాయిన్ ధర దూసుకెళ్లింది. ఆయన అధ్యక్ష కార్యాలయంలోకి రాగానే.. క్రిప్టోలపై పని చేయడానికి ఓ ప్రెసిడెన్షియల్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటుచేశారు. ఈ సంస్థ అవసరమైన చట్టాలు, నిబంధనలు తయారుచేయనుంది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక గతంలో క్రిప్టో కంపెనీలపై జరుగుతున్న చాలావరకు దర్యాప్తులు నిలిచిపోయాయి.

## ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీకి నవరత్న హోదా



రైల్వేకు సంబంధించి రెండు ప్రభుత్వరంగ సంస్థలకు కేంద్రం నవరత్న హోదా ఇచ్చింది. ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నవరత్న హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. నవరత్న హోదా కలిగిన 25వ కంపెనీగా ఐఆర్‌సీటీసీ గుర్తింపు పొందగా.. ఐఆర్‌ఎఫ్‌సీని 26వ కంపెనీగా అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఐఆర్‌సీటీసీ రూ.4270.18 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగి ఉంది. ఐఆర్‌ఎఫ్‌సీ వార్షిక టర్నోవర్ రూ.26,644 కోట్లుగా ఉంది. కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీలకు మినీరత్న, నవరత్న, మహారత్న పేరుతో మూడు రకాల హోదాలను కేంద్రం కేటాయిస్తుంటుంది. ఆర్థికంగా, నిర్వహణ పరంగా నిర్ణీత స్థాయిని అందుకున్నాక ఆయా సంస్థలకు ఈ హోదాను కేంద్రం ఇస్తుంటుంది. ఈ గుర్తింపు పొందిన సంస్థలు పెట్టుబడులు, ఇతర విషయాల్లో సొంతంగా నిర్ణయం తీసుకోగలవు. నవరత్న కంపెనీలు రూ.1000 కోట్ల వరకు లేదా మొత్తం విలువలో 15 శాతం మేర ప్రభుత్వ ఆమోదం లేకుండా పెట్టుబడులు పెట్టొచ్చు.

# ఎయిర్‌టెల్ ఐపీఓ ప్లాన్స్..

### దలాల్‌స్ట్రీట్‌కు రెండు పబ్లిక్ ఇష్యూలు




ప్రముఖ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ నుంచి త్వరలో రెండు పబ్లిక్ ఇష్యూలు రాబోతున్నాయి. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఒకటి కాగా.. డేటా సెంటర్ వ్యాపారమైన ఎన్ఎక్స్‌ట్రా రెండోది. ఇందులో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తొలుత ఐపీఓకు రానుంది. డేటా సెంటర్ వ్యాపారం తర్వాత పబ్లిక్ ఇష్యూగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ 2017లో కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.700 కోట్ల ఆదాయాన్ని, రూ.18.5 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 10 ఏళ్లలో లిస్టింగ్ కావాల్సి ఉన్నందున తొలుత ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఐపీఓగా తీసుకురానున్నారు. రాబోయే రెండేళ్లలో ఈ ఐపీఓ ఉండే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు భారతీ ఎన్ఎక్స్‌ట్రా పేరుతో డేటా సెంటర్ వ్యాపారం నిర్వహిస్తోంది. ఇందులో 75 శాతం వాటా ఎయిర్‌టెల్‌కు ఉండగా.. కార్లే ఈక్విటీ సంస్థ 24 శాతం వాటా ఉంది. ప్రస్తుతం డేటా సెంటర్ వ్యాపారంలో ఈ కంపెనీకి 12 శాతం మార్కెట్ వాటా ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 231.8 కోట్లు లాభాన్ని ఆర్జించిన ఈ సంస్థ.. 1,826 కోట్లు ఆదాయాన్ని నమోదు చేసింది. రాబోయే రోజుల్లో ఈ విభాగంలో మరింత పోటీ ఉండబోతోందని, మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది.



## ప్రభాస్ సరసన నటించనున్న భాగ్యశ్రీ బోర్సే


పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది కల్కి సినిమాతో బాక్సాఫీస్ వద్ద హిట్టు కొట్టాడు డార్లింగ్. ఈ ప్రాజెక్ట్ తర్వాత వరుసగా తన సినిమాలను కంప్లీట్ చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని నెలలుగా వరుస సినిమాల చిత్రీకరణలతో బిజీగా ఉన్నాడు. ఇప్పటికే డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తోన్న రాజా సాబ్ చిత్రీకరణలో బిజీగా ఉన్నాడు. హారర్ కామెడీ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అలాగే డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తోన్న ప్రేమకథ చిత్రంలో కొత్త అమ్మాయి ఇమాన్వి కథానాయికగా నటిస్తుంది. ఇదిలా ఉంటే.. తర్వలోనే మరో ప్రాజెక్ట్ స్టార్ట్ చేయనున్నాడు. అసలు విషయానికి వస్తే.. సందీప్ రెడ్డి డైరెక్షన్లో స్పిరిట్ చిత్రంలో నటించనున్నాడు ప్రభాస్. అలాగే డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలోనూ ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఈ సినిమా డిఫరెంట్ గా ఉండనుందని సమాచారం. తాజాగా ఈ మూవీ గురించి ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ప్రభాస్ సరసన మరో కొత్త హీరోయిన్ నటించనుందట. ఆమె మరెవరో కాదు.. భాగ్య శ్రీ బోర్సే.



## నాలుగు పదుల వయస్సులో తగ్గని అందం

## ఖడ్గం హీరోయిన్ స్పెషల్ అట్రాక్షన్

ఖడ్గం చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు అంత సులువుగా మరిచిపోలేరు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజు ఈ సినిమా తప్పక ప్రసారం కావల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కించగా, ఇందులో హీరో శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, రవితేజ, బ్రహ్మజీ ప్రధాన పాత్రలు పోషించారు. ఇక కథానాయికలుగా సోనాలి బింద్రే, సంగీత నటించారు. ఇక చిత్రంలో ఓ భామ స్పెషల్ అట్రాక్షన్గా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె మరెవరో కాదు కిమ్ శర్మ. ముసుగు వెయ్యొద్దు మనసు మీద అంటూ వచ్చే పాటతో ఓ ఊపు ఊపేసిన ఈ చిన్నది తెలుగు అడియన్స్ హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. అయితే చాలా మంది తారలు కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు సినీ పరిశ్రమ నుండి మెల్లగా తప్పుకుంటున్నారు. ఆ కోవలో కిమ్ శర్మ కూడా ఒకరు.ఖడ్గం చిత్రంలో శ్రీకాంత్ వెంటపడినఈ అమ్మాయి ఖడ్గం సినిమాలో వన్ ఆఫ్ ది బెస్ట్ రోల్ లో నటించింది. రామ్ చరణ్ నటించిన మగధీర చిత్రంలో కూడా ఈ భామ స్పెషల్ సాంగ్‌తో అదరగొట్టేసింది. అయితే ఎందుకో ఈ మధ్య తెలుగు సినిమాలలో కనిపించడం లేదు. బాలీవుడ్‌లో సెటిల్ అయిందని తెలుస్తుండగా, అక్కడ పలు సినిమాలతో పాటు స్పెషల్ సాంగ్స్ చేస్తుంది. కిమ్ శర్మ.. బీటౌన్ నటుడు హర్షవర్ధన్ రానాతో ప్రేమాయణం సాగించినట్టు అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. ఇద్దరు పలు మార్లు బయట జంటగా కనిపించారు. అయితే ఏం జరిగిందో ఏమో కాని ఈ ఇద్దరు విడిపోయారు. అయితే సినిమాలకి కాస్త దూరంగా ఉంటున్న కిమ్ శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర ఫొటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటుంది. ప్రస్తుతం కిమ్ శర్మ వయసు 44 ఏళ్లు వయస్సు ఉంటుందని, ఈ వయసులోనూ ఏమాత్రం చెరగని అందంతో అభిమానులను కట్టిపడేస్తుంది అని అంటున్నారు. ఏది ఏమైన ఈ వయస్సులోను కిమ్ శర్మ ఇలా రెచ్చగొడుతుండడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది.



## ఎంత ఇచ్చినా ఆ హీరోతో నో

దక్షిణాది చిత్రపరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్. అత్యధిక పారితోషికం తీసుకునే సినీతారలలో ఆమె ఒకరు. నయనతార.. సౌత్ ఇండస్ట్రీని ఏలేసిన అమ్మడు. తెలుగు, తమిళం భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం తన భర్త, పిల్లలతో ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తూనే మరోవైపు సినిమాల్లోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే.. నయనతార రూ.100 కోట్లు ఇచ్చిన ఓ హీరోతో నటించనని ముఖం మీదే చెప్పేసిందట. షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ సీనియర్ బ్యూటీ, ఆ సినిమాతో సూపర్ డూపర్ హిట్ సాధించింది. ఆ తర్వాత నయనతారకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం కేజీఎఫ్ స్టార్ యష్‌తో కలిసి టాక్సిక్ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా కోసం పాన్ ఇండియా అభిమానులు ఎదురుచూస్తున్నారు. కానీ ఈ సినిమా షూటింగ్, వివరాలను చాలా గోప్యంగా ఉంచారు. ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి నటిస్తున్నారని సమాచారం. మలయాళ గీతు మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నయనతార పాత్ర చాలా ముఖ్యమైనదని తెలుస్తోంది. జవాన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న నయన్.. ఈ మూవీ తర్వాత తన పారితోషికం మరింత పెంచిందని టాక్. అయితే ఓ హీరోతో మాత్రం రూ.100 కోట్లు నటించనని చెప్పేసిందట. అతడు మరెవరో కాదు.. శరవణన్. ది లెజెండ్ సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు. 2022లో విడుదలైన ఈ సినిమా అంతగా హిట్ కాలేదు. అయిత తన సినిమాలో నయనతారను కథానాయికగా తీసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాడట. కానీ నయన్ అందుకు ఒప్పుకోలేదు. నయనతారకు బదులుగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా శరవణన్ సరసన హీరోయిన్‌గా నటించింది. ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపికా పదుకొనే, అలియా భట్ అత్యధికంగా పారితోషికం తీసుకుంటున్నారు. కానీ రూ.100 కోట్లు ఇచ్చినా అతడి పక్కన నటించనని నయన్ చెప్పినట్లు వార్తలు నెట్టింట హల్చల్ అవుతున్నాయి. దీనిపై ఇప్పటివరకు నయన్ స్పందించలేదు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com